ANN తెలుగు

Follow: @ANNTELUGU

21-06-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 170 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

ప్రరీక్షలు సజావుగా జరగాలంటే 'డిజిటల్ లాక్‌డౌన్' తప్పదా? యాప్‌లపై తాత్కాలిక నిషేధాలతో ప్రశ్నాపత్రాల లీకేజీల మహమ్మారిని అడ్డుకోగలమా? సాంకేతికతను బంధిస్తే సరిపోతుందా... వ్యవస్థ లోపల తిష్టవేసిన అవినీతి తిమింగలాలకు ఈ 'లాక్‌డౌన్' అసలైన మెడిసిన్ అవుతుందా? లీకేజీల వెనుక ఉన్న అసలు పాపాత్ములపై ఉక్కుపాదం మోపేదెన్నడు? జాతీయ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తున్న 'నీట్' లీకేజీ బాధ్యత నుండి, కేవలం 'రీఎగ్జామ్' అనే వంకతో కేంద్ర సర్కారు చేతులు దులుపుకుందా? దేశ భవిష్యత్తు అయిన యువత రోడ్లెక్కి నిరసనలు తెలుపుతుంటే... ప్రభుత్వం ఆ ఆందోళనలను 'లైట్' తీసుకోవడం ఎంతవరకు సమంజసం? విద్యార్థి లోకాన్ని వేధిస్తున్న ప్రశ్నలపరంపర ఇది. తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన మూసీ ప్రాజెక్టు అడుగులు ముందుకు పడ్డట్లేనా? విపక్షాల విమర్శలు, ఆందోళనల మధ్యే గాంధీసరోవర్ పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్ రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల ఫలించినట్లేనా? ఇటు ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన సాయికృష్ణ లాకప్ డెత్ వ్యవహారం కూటమి ప్రభుత్వానికి అంత సులువుగా చెరిగిపోని మాయని మచ్చగా మారబోతోందా?

04



తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్

**కంది రామచంద్రారెడ్డి**

**వీకెండ్ అనాలసిస్**

టాప్ న్యూస్



## భారత్ ధర్మసత్రం కాదు : అమిత్ షా వ్యాఖ్యలు

చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు

02



## హైదరాబాద్ ప్లస్'గా అమరావతి నిర్మాణం

- ఇంటింటికీ యోగాను తీసుకెళ్లాం.
- జాతీయ మీడియాతో సీఎం చంద్రబాబు.

02



## అక్కడే చూసుకోండి.. ఇక్కడకు రావొద్దు

- తెలంగాణ రాజకీయాల్లో జోక్యం వద్దు
- సినిమాలు వేరు, రాజకీయాలు వేరు
- పవన్‌కు కవిత మరోసారి వార్నింగ్

02



## వర్చువల్ కుదరదు

- కోర్టుకు హాజరు కావాల్సిందే
- అల్లు అర్జున్‌కు న్యాయస్థానం ఆదేశం

02

# అక్రమాలపై.. మహా అంకుశం

## భూమాఫియా గుండెల్లో 'టాస్క్ ఫోర్స్' అక్షర పాశుపతాస్త్రం కదలివచ్చిన అధికార యంత్రాంగం!

**హైదరాబాద్, మహాటాస్క్ ఫోర్స్**

సమాజంలో వేళ్లూనుకుపోతున్న అన్యాయాలపై, అక్రమార్కుల గుట్టుపై 'మహా' పత్రిక అంకుశంలా అక్షర పాశుపతాస్త్రాలను సంధించింది. ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించి.. మధ్యతరగతి ప్రజల సొంతింటి ఆశలను వంచించి.. కోట్లు కొల్లగొడుతున్న నయా దగాకోరుల బండారాన్ని బట్టబయలు చేసింది. రెవెన్యూ అధికారుల అండదండలతో రెచ్చిపోతున్న భూమాఫియా వెనుక ఉన్న అసలు గుట్టును కళ్లకు కడుతూ.. 'మహా టాస్క్ ఫోర్స్' క్షేత్రస్థాయి పరిశోధనలతో నిజాలను నిగ్గుతేల్చింది. మిగతా 2వ పేజీలో






16 రకాల కాంబినేషన్

## ఔషధాలపై కేంద్రం కొరడా

- తక్షణమే నిషేధం అమలు.
- స్పష్టం చేసిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ.

03

## కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి మరో లేఖ

- ఇద్దరం కలిసి వెళ్దాం.. నేను ఢిల్లీలోనే ఉంటా
- కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అపాయింట్ మెంట్ ఫిక్స్ చేయండి
- మెట్రో ఫేజ్-2, ఐఆర్ఎఫ్‌సీ నిధులపై కేంద్రం చొరవ చూపాలి

02



## యోగా ఒక మతానికి పరిమితం కాదు

### అలా చూడటం మూర్ఖత్వం

- మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ వేదికగా యోగా ఉత్సవాలు
- ప్రపంచానికి భారత్ అందించిన గొప్ప కానుక యోగా అన్న వెంకయ్య నాయుడు
- మనిషిని సమగ్ర మనిషిగా మార్చే అద్భుత సాధనం యోగా అని వ్యాఖ్య

03





## మళ్లీ యుద్ధ మేఘాలు

- హోర్ముజ్ జలసంధి మూసివేత.
- లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు
- ఐదుగురు మృతి
- ఇరాన్ ప్రకటనను తోసిపుచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.

03

## పోక్సో కేసులో బండి భగీరథ్ కు ఊరట

- వారం రోజులు మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన కోర్టు
- చర్లపల్లి జైలు నుంచి విడుదల
- పరీక్షల కోసం షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన కోర్టు
- 26 వరకు బెయిల్ పై ఇంట్లో ఉండనున్న భగీరథ్

03





## యథేచ్ఛగా అక్రమ నిర్మాణం

- చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు
- ఫిర్యాదు చేసిన పట్టించుకోని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సొసైటీ సభ్యులు

02

## సీఎం అయినా.. భార్య పర్మిషన్ తీసుకోవాల్సిందే!

- పల్నాడు పర్యటనలో ఆసక్తికర ఘట్టం
- కోల్డ్ ప్రెస్డ్ నూనె కొనుగోలుకు ముందు భువనేశ్వరికి చంద్రబాబు ఫోన్
- ప్రకృతి వ్యవసాయంపై రైతుల కృషికి ముఖ్యమంత్రి అభినందనలు.

02







# యథేచ్ఛగా అక్రమ నిర్మాణం



**హైదరాబాద్, మహా :** అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన మునిసిపల్ అధికారులు భవన అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మునిసిపల్ అధికారులపై తీరుపై బంజారాహిల్స్ లోని శ్రీ వేంకటేశ్వర కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వీఐపీలు, ఉన్నతాధికారులు తిరిగే కాలనీలో భవన నిర్మాణ పనులు నిరంతరం సాగుతున్నా అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై కాలనీ వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 12 లోని ఎమ్మెల్యే కాలనీలో ఫ్లాట్ నంబర్ 55 ఏ కు సంబంధించిన యజమాని భవన నిర్మాణం కోసం మునిసిపల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారు. అయితే అధికారులు అనుమతించిన సిల్ట్ ఫ్లస్ 4 అంతస్థుల అనుమతికి బదులు ఆరంతస్థుల భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ విషయంపై కాలనీ వాసులు, సొసైటీ సభ్యులు స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు సర్కిల్ 36 డిప్యూటీ కమిషనర్ కు ఫిర్యాదులు చేశారు. అయినప్పటికీ భవన నిర్మాణ పనులను కనీసం పరిశీలించని అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిపై సొసైటీ అధ్యక్షులు నారాయణరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలను ఆపాల్సిన అధికారులు మౌనం వహించడం వెనుక ఏదో మతలబు ఉందని ఆయన ఆరోపించారు. అక్రమ నిర్మాణాన్ని ఆపాలాని కోరుతూ అధికారులను పలు పర్యాయాలు కలవడం జరిగిందని, అయినా ఫలితం లేదని ఆయన వాపోయారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారులు స్పందించి అక్రమంగా నిర్మిస్తున్న భవనాన్ని ఆపాలాని కోరారు. కఆరంతస్థుల భవన నిర్మాణం వల్ల కార్ల పార్కింగ్ తో పాటు అనేక రకాల ఇబ్బందులను కాలనీ వాసులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు.

# అక్రమాలపై.. మహా అంకుశం

**( మొదటి పేజీ తరువాయి )**

గత నెలరోజులుగా 'మహా' సంధించిన అక్షర తూటాలకు పాఠకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతుండగా, అటు ప్రభుత్వ యంత్రాంగంలోనూ చలనం మొదలైంది. కొన్నిచోట్ల అధికారులు కొరడా ఝుళిపించి తప్పులను సరిదిద్దగా.. మరికొన్ని చోట్ల మాత్రం అధికారులు ఇంకా మీనమేషాలు లెక్కేస్తూ అక్రమార్కులకు పరోక్షంగా కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'మహా టాస్క్ ఫోర్స్' కథనాలు సృష్టించిన ప్రకంపనల వివరాలు ఇలా ఉన్నాయి.



మైల్ స్టోన్ రియల్టర్ల
అరాచకం
చెరువు అలుగు, నాలాల ఆక్రమణ
లోకల్ బాడీలకు సంబంధం ఉండేది
నేడు విచ్చలవిడిగా అనుమతులిస్తున్న హెచ్ఎండీఏ
విజిలెన్స్, ఎన్ఫోర్స్ మెంట్ జాడ ఎక్కడ?
అవినీతి తిమింగలాలపై చర్యలుండేనా?
అనుమతులు రద్దు చేయకుంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తాం: సామాజిక వేత్తలు



రాక్ వెల్ ఇంటర్నేషనల్ స్కూల్
బరితెగింపు
జీవో 111కు తూట్లు
జీరో అనుమతులతో బహుళ అంతస్తుల నిర్మాణాలు



మహా
రియల్ మాఫియా
అరాచకం
శ్రీకారం ఐకానిక్ వెంచర్లంటూ నయా మోసం
ఫామ్ ల్యాండ్ పేరుతో అక్రమ దందా
గజాల్లో విక్రయాలు.. గుంటల్లో రిజిస్ట్రేషన్లు
ప్రజాప్రతినిధుల అండ.. చక్రం తిప్పుతున్న తహసీల్దార్లు
హెచ్ఎండీఏ, డీటీసీపీ, రెరా అనుమతులు మచ్చుకైనా లేవు
నాలా కన్వర్షన్ అసలే ఉండదు
కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న అక్రమార్కులు
నారాయణఖేడ్ డివిజన్ మనూర్ మండలం దాపూర్‌లో శ్రీనివాసుడు లీలలు

**1. నారాయణఖేడ్ 'శ్రీకారం' అక్రమాల గుట్టురట్టు!**

ఫార్మ్‌లాండ్స్, అక్రమ వెంచర్ల పేరిట సాగుతున్న భారీ దందాకు 'మహా' పత్రిక చెక్ పెట్టింది. నారాయణఖేడ్ వేదికగా "శ్రీకారం సంస్థ", "ఆయుష్మాన్ భవ", "ఐకానిక్ హౌసింగ్ ఫార్మ్ లాండ్" పేర్లతో నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న అక్రమ వెంచర్ల భాగోతాన్ని ఆధారాలతో సహా వెలుగులోకి తెచ్చింది. అమాయక ప్రజలను ఆకర్షించి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న ఈ సంస్థల వెనుక ఉన్న అదృశ్య హస్తాలను, రెవెన్యూ అధికారుల లోపాయికారీ సహకారాన్ని 'మహా' ఎండగట్టింది.

**2. కొండాపూర్ కోటలు బద్దలు: రూ.10 కోట్ల ప్రభుత్వ ఆస్తి స్వాధీనం**

కొండాపూర్‌లోని సర్వే నెంబర్ 59లో కొందరు అక్రమార్కులు ఏకంగా ప్రభుత్వ భూమినే మింగేశారు. అధికారుల కళ్లు గప్పి.. ఏకంగా ఏడంతస్తుల భారీ భవనాన్ని లేపేశారు. ఈ బహుళ అంతస్తుల అక్రమ కట్టడం వెనుక ఉన్న అసలు సూత్రధారులు, పాత్రధారులను 'మహా' వరుస కథనాలతో ఎండగట్టింది. దీనికి స్పందించిన ఉన్నతాధికారులు సదరు నిర్మాణదారులకు నోటీసులు జారీ చేసి, సుమారు రూ. 10 కోట్ల విలువైన ఆ ఏడంతస్తుల భవనాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. ఇది 'మహా' అక్షర శక్తికి దక్కిన విజయకేతనం.

**3. 'ఏపీఆర్ ప్రవీణ్స్'పై కొరడా!**

రియల్ ఎస్టేట్ ముసుగులో 'ఏపీఆర్ ప్రవీణ్స్' సంస్థ చేసిన భూ ఆక్రమణలు, నిబంధనల ఉల్లంఘనలపై 'మహా' పత్రిక నిరంతరం గొంతు విప్పింది. ఈ సంస్థ చేసిన బరితెగింపులను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచడంతో 'మహా ఎఫెక్ట్' గట్టిగా తగిలింది. రంగంలోకి దిగిన అధికారులు ఆక్రమిత ప్రాంతాల్లో ప్రహరీలను బుల్డోజర్లతో భారీ కూల్చివేతలు చేపట్టారు.

**4. 'రాక్ వెల్ స్కూల్' ఉల్లంఘనల గుట్టురట్టు**

విద్యాసంస్థల పేరిట సాగుతున్న అక్రమాలను సైతం 'మహా టాస్క్ ఫోర్స్' వదిలిపెట్టలేదు. శంషాబాద్ 'రాక్ వెల్ స్కూల్' యాజమాన్యం నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ సాగిస్తున్న వ్యవహారాలపై ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. దీంతో ఉలిక్కిపడిన విద్యాశాఖ అధికారులు పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ కోరారు.

**5. అత్వెల్లిలో 'మైల్ స్టోన్' అక్రమం.. ఇరిగేషన్ నోటీసులు!**

ప్రకృతి ప్రసాదించిన నాలాలను సైతం వదలకుండా అత్వెల్లిలో 'మైల్ స్టోన్' నిర్మాణ సంస్థ సాగించిన అక్రమ దందాను 'మహా' పత్రిక వరుస కథనాలతో బట్టబయలు చేసింది. పెద్ద చెరువు నాలాలు, అలుగులు కబ్జా.. నోట్ల కట్టలతో హెచ్ఎండీఏ నోళ్లు మూయించిన రియల్ మాఫియాపై మహాపత్రికలో కథనాలు ప్రచురితమయ్యాయి. నిబంధనలకు విరుద్ధంగా పెద్ద చెరువు నాలాలు, అలుగులను మింగేస్తూ.. కల్వర్టుల మధ్యే ఏకంగా వెంచర్ కమాన్‌ను నిర్మించారు. అధికారుల అండ: ఇరిగేషన్ అధికారులు ఎన్‌ఓసీ జారీ చేయకపోయినా.. కోట్లు మింగిన హెచ్ఎండీఏ అధికారులు ఈ వివాదాస్పద లేఅవుట్‌కు అనుమతులు మంజూరు చేయడం గమనార్హం. 'మహా స్పెషల్ టాస్క్ ఫోర్స్' వరుస కథనాలతో ఈ అవినీతి భాగోతాన్ని ఎండగట్టడంతో ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు నిద్రలేచారు. నాలాల ఆక్రమణపై సదరు మైల్ స్టోన్ సంస్థకు లీగల్ నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ జాయింట్ సర్వే రిపోర్టులతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

**మహా హెచ్చరిక:** అక్రమాలపై 'మహా' సంధించిన అక్షర అస్త్రం ఇక్కడితో ఆగదు. ప్రజాధనాన్ని, ప్రభుత్వ భూములను కొల్లగొట్టే అక్రమార్కులు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. కొన్నిచోట్ల ఇంకా మీనమేషాలు లెక్కిస్తూ, అక్రమార్కులకు పరోక్షంగా సహకరిస్తున్న అధికారుల వ్యవహారాలను సైతం త్వరలోనే 'మహా టాస్క్ ఫోర్స్' బయటపెట్టబోతోంది. స్టే ట్యూన్డ్!

# పేడలో పుట్టిన పురుగులు మళ్లీ అక్కడికే వెళ్లాయి

**రెబల్ ఎంపీలపై రౌత్ ఘాటు వ్యాఖ్యలు**

మహా : శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ పార్టీని వీడిన నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా ధారాశివ్ ఎంపీ ఓంరాజే నింబాల్కర్, హింగోలి ఎంపీ నగేశ్ పాటిల్ అస్థికర్‌లను లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. పార్టీ ఇచ్చిన అవకాశాలతోనే రాజకీయంగా ఎదిగిన నేతలు ఇప్పుడు పార్టీని వీడడం ద్రోహమని రౌత్ అన్నారు. ఒకప్పుడు ఉద్ధవ్ ఠాక్రేను ఎప్పటికీ వదిలిపెట్టనని చెప్పిన నేతలే ఇప్పుడు మారిపోయారని ఎద్దేవా చేశారు. ''పేడలో పుట్టిన పురుగులు మళ్లీ పేడలోకే వెళ్లాయి'' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై కూడా రౌత్ విమర్శలు సంధించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నా రాజకీయాల్లో పరిస్థితులు ఎప్పుడైనా మారిపోతాయని అన్నారు. ఈ రోజు ఉన్న పదవులు రేపు ఉండకపోవచ్చని వ్యాఖ్యానించారు. షిండేను పెద్ద రాజకీయ నాయకుడిగా చూపించే ప్రయత్నాలను కూడా ఆయన కొట్టిపారేశారు.



# అక్కడే చూసుకోండి.. ఇక్కడకు రావొద్దు

**పవన్‌కు కవిత మరోసారి వార్నింగ్**

**హైదరాబాద్, మహా :** జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏపీలోనే రాజకీయాలు చేసుకోవాలని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్ మణికొండలో జనసేన కార్యాలయాన్నిపవన్ కల్యాణ్ ప్రారంభించడం, ఇటీవల జరిగిన పరిణామాలపై ఆమె స్పందించారు. పవన్ కల్యాణ్ సినిమాలు చూసి సంతోషిస్తామని చెప్పిన ఆమె సినిమాల ముసుగులో వచ్చి తెలంగాణను కబ్జా చేస్తారని వ్యాఖ్యానించారు. గతంలోనూ ఇదే జరిగిందన్నారు. సినిమాల ముసుగులో వచ్చి ఆంధ్ర భాష బాగుంది.. తెలంగాణ యాస బాగోలేదని మొదలు పెడతారని మండిపడ్డారు. పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ పుట్టకముందే తమను ఏడ్పించారని, తెలంగాణ యాసలో మాట్లాడలేని పరిస్థితులు ఉండేవన్నారు. తెలంగాణ యాసలోనే, భాషలోనే మాట్లాడతామని కొట్లాడినామని కవిత చెప్పారు. ''మా ఊరు భువనగిరి.. నా పేరు యాదగిరి.. నేను చేసేది దాదాగిరి'' అనే సినిమా డైలాగు చెప్పి తెలంగాణలోని అన్ని ప్రాంతాలవారిని అవమానించారని కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమం తర్వాత తెలంగాణ డైలాగ్స్‌ను హీరోలకు పెట్టడం ప్రారంభించారని చెప్పారు. తెలంగాణ భాషలో మాట్లాడటం ఫ్యాషన్ అయిందని, పవన్ కల్యాణ్ సినిమాలు చూడాలని, అతని డ్యాన్స్ చూసి సంబురపడాలని, కానీ రాజకీయాల్లో రానివద్దని యువతకు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ రండి.. పోండి.. మేకప్, పేకప్‌లు చెప్పుకోండి కానీ రాష్ట్ర సెక్రటేరియట్ వైపు చూస్తే ఊరుకునేది లేదని జనసేన పార్టీ నేతలు, ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను కల్వకుంట్ల కవిత హెచ్చరించారు.

# సీఎం అయినా.. భార్య పర్మిషన్ తీసుకోవాల్సిందే!

**పల్నాడు,మహా :** ముఖ్యమంత్రి హోదాలో నిత్యం పాలనా వ్యవహారాలతో ఎంత బిజీగా ఉన్నా.. ఇంటి విషయానికొచ్చేసరికి ఇల్లాలు మాటే శాసనం! ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పల్నాడు జిల్లా పర్యటనలో సరిగ్గా ఇలాంటి ఆసక్తికర ఘటనే చోటుచేసుకుంది. ఒక రైతు వ్యవసాయ క్షేత్రంలో స్వచ్ఛమైన కోల్డ్‌ప్రెస్డ్ (గానుగ) వేరుశనగ నూనెను కొనుగోలు చేసే ముందు, చంద్రబాబు తన సతీమణి నారా భువనేశ్వరికి అక్కడికక్కడే ఫోన్ చేసి మాట్లాడటం అందరినీ ఆకర్షించింది. "ఇంట్లోకి ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా ఆమెను అడగాల్సిందే" అంటూ సీఎం నవ్వుతూ చేసిన సరదా వ్యాఖ్యలు అక్కడున్న వారిలో ఉత్సాహాన్ని నింపాయి. శనివారం చిలకలూరిపేట సమీపంలోని లింగంగుంట్లలో ఈ అరుదైన సన్నివేశం చోటుచేసుకుంది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పల్నాడు జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఈ క్రమంలో లింగంగుంట్లలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఆదర్శ రైతు గుడిపల్లి నాగభూషణం వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. గత నాలుగేళ్లుగా రసాయన ఎరువులు లేకుండా పూర్తిగా ప్రకృతి సిద్ధమైన పద్ధతుల్లో సాగు చేస్తున్న విధానాలను నాగభూషణం ముఖ్యమంత్రికి సవివరంగా తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి ఖర్చు గణనీయంగా తగ్గడమే కాకుండా, భూసారం పెరిగి మంచి దిగుబడులతో వ్యవసాయం లాభసాటిగా మారిందని ఆయన తెలిపారు. దీనిపై హర్షం వ్యక్తం చేసిన చంద్రబాబు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నాగభూషణం లాంటి ఆదర్శ రైతులను చూసి మిగతా వారు స్ఫూర్తి పొందాలని ఆయన కొనియాడారు.

అనంతరం రైతు నాగభూషణానికి చెందిన ఆర్గానిక్ వేరుశనగ గానుగ కేంద్రాన్ని ముఖ్యమంత్రి ఆసక్తిగా పరిశీలించారు. వేరుశనగ, నువ్వులు, కొబ్బరి తదితర నూనె గింజల నుంచి అత్యంత సహజ పద్ధతిలో నూనెను ఎలా తీస్తున్నారో స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ స్వచ్ఛమైన నూనెను ఒకసారి వాడి చూడాలని రైతు కోరగా.. ముఖ్యమంత్రి వెంటనే తన సతీమణి భువనేశ్వరికి ఫోన్ చేసి కనుక్కొని మరీ కిలో నూనెను కొనుగోలు చేయడం విశేషం. ఇలాంటి సంప్రదాయ గానుగ పరిశ్రమల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో భాగంగా గో ఆధారిత ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని కూడా సందర్శించిన సీఎం.. అక్కడ జీవామృతం, ఘన జీవామృతం తయారీ విధానాలను తిలకించారు. రైతు సాగు చేస్తున్న బొప్పాయి తోటను పరిశీలించి, ఆయన ప్రేమగా అందించిన ఆర్గానిక్ బొప్పాయి పండును ముఖ్యమంత్రి రుచి చూశారు. అంతర పంటల సాగుతో జీవ వైవిధ్యం పెరిగి చీడపీడల బెడద ఎలా తగ్గుతుందో ఈ సందర్భంగా రైతు ముఖ్యమంత్రికి వివరించారు.



# భారత్ ధర్మసత్రం కాదు : అమిత్ షా వ్యాఖ్యలు

**చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు**

**ముంబై, మహా :** శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. "ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం" అని ఆయన పేర్కొన్నారు.



# కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్‌రెడ్డి మరో లేఖ.

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ మహానగర రవాణా వ్యవస్థకు అత్యంత కీలకమైన మెట్రో రైలు ప్రాజెక్టు పెండింగ్ అంశాల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతూ కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి మరోసారి లేఖ రాశారు. ప్రధానంగా మెట్రో ఫేజ్ 2 విస్తరణతో పాటు, ప్రాజెక్టుకు సంబంధించిన ఐఆర్ఎఫ్‌సీ (ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్) నిధుల విడుదలపై తక్షణమే చర్చలు జరపాల్సి ఉందని ఆయన ఆ లేఖలో స్పష్టం చేశారు. ఈ నెల 16న కూడా ఇదే అంశంపై తాను లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేసిన ముఖ్యమంత్రి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ఒక ఉన్నతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రానున్న జూన్ 22, 23 తేదీల్లో తాను అధికారిక పర్యటన నిమిత్తం ఢిల్లీలో ఉండనున్నట్లు రేవంత్‌రెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా, ఆ సమయంలో తామిద్దరం (ముఖ్యమంత్రి, కిషన్‌రెడ్డి) ఉమ్మడిగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసేలా అపాయింట్‌మెంట్ ఖరారు చేయాలని కోరారు. హైదరాబాద్ నగరానికి, రాష్ట్ర ప్రగతికి మెట్రో రైలు అత్యంత కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని, దీనికి సంబంధించిన పెండింగ్ అంశాలపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఉద్ఘాటించారు. రైల్వే మంత్రితో జరిగే భేటీకి ప్రాజెక్టు ఒప్పందాలు, సంబంధిత పత్రాల కాపీలు సహా పూర్తి వివరాలను తాను స్వయంగా తీసుకువస్తానని ముఖ్యమంత్రి వివరించారు. ఈ మేరకు సమావేశాన్ని ఖరారు చేసి తనకు వివరాలు తెలియజేయాలని కిషన్‌రెడ్డిని ఆయన కోరారు.

# హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం

**విశాఖపట్నం, మహా** : ఏపీ రాజధాని అమరావతిని హైదరాబాద్ ప్లస్'గా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఉండవల్లి గుహల వద్ద ఏర్పాటు చేసిన 'యోగాంధ్ర' కార్యక్రమం సందర్భంగా ఆయన జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్‌ను నిర్మించిన తర్వాత, ఇప్పుడు నవ్యాంధ్రకు అమరావతిని నిర్మించే అదృష్టాన్ని భగవంతుడు తనకు ప్రసాదించాడని పేర్కొన్నారు. సైబరాబాద్, హైదరాబాద్ నగరాలు నేడు తెలంగాణ రాష్ట్రానికి అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయని, దేశంలోనే అత్యంత నివాసయోగ్యమైన నగరంగా హైదరాబాద్ ఎదిగిందని ఆయన గుర్తుచేశారు. ఇదే స్ఫూర్తితో అమరావతిని ఆరోగ్య, సంపన్న, ఆనంద, ఆధ్యాత్మిక నగరంగా (హెల్తీ, వెల్తీ, హ్యాపీ సిటీగా), ఒక అద్భుతమైన నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. గతంలో విశాఖపట్నంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎంతో ఘనంగా నిర్వహించామని, ఈ ఏడాది ఆ వేడుకలను అమరావతి వేదికగా భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత అమూల్యమైన బహుమతి యోగా అని ఆయన అభివర్ణించారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా మానసిక ఒత్తిడిని పూర్తిగా జయించి, అపారమైన ఏకాగ్రతను సాధించవచ్చని స్పష్టం చేశారు. యోగాను ప్రతి ఇంటికీ తీసుకువెళ్లాలన్నదే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, దీనిని ఒక మిషన్ మోడ్‌లో ప్రజలకు చేరువ చేస్తామన్నారు. ఇందుకోసం ప్రపంచవ్యాప్తంగా యోగా విశిష్టతను చాటిన ప్రముఖ యోగా గురువు బాబా రామ్‌దేవ్ తో రాష్ట్ర ప్రభుత్వం కలిసి పనిచేస్తుందని వివరించారు. కేవలం టెక్నాలజీ మాత్రమే పూర్తి సంపదను, సంతోషాన్ని సృష్టించలేదని, భారతదేశానికి ఉన్న నిజమైన, అత్యంత అమూల్యమైన శక్తి ఇక్కడి ఉత్కృష్టమైన ఆధ్యాత్మికత, సంస్కృతేనని చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. నేటి యువత అత్యాధునిక సాంకేతికతతో పాటు మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మికతను సమన్వయం చేసుకుంటూ భవిష్యత్తు వైపు విజయవంతంగా అడుగులు వేయాలని ఈ సందర్భంగా ఆయన దిశానిర్దేశం చేశారు.

# భారతదేశం పై ఎల్నినో ముప్పు..!

**మహా వరంగల్ బ్యూరో:** దేశవ్యాప్తంగా వాతావరణ పరిస్థితుల పై ఎల్నినో ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రస్తుతం ఏర్పడుతున్న పరిస్థితులు మరింత బలపడి సూపర్ ఎల్ నినోగా మారే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2015 లో నమోదైన ఎల్నినో పరిస్థితులను తలపించే విధంగా ఈసారి ప్రభావం ఉండవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం, వాతావరణంలో అసాధారణ మార్పులు చోటుచేసుకోవడం వల్ల దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షపాతం తగ్గే ప్రమాదం ఉందని తెలుస్తోంది. ఎల్నినో ప్రభావంతో దేశంలో సాధారణ వర్షపాతం కంటే సుమారు 10 శాతం వరకు తగ్గుదల నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి కీలకమైన ఖరీఫ్ సీజన్తో పాటు సీతాకాల వాతావరణం పై కూడా ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వర్షాభావ పరిస్థితులు, అధిక ఉష్ణోగ్రతలు, తాగునీటి కొరత వంటి సమస్యలు తలెత్తే అవకాశ మున్నందున రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది. వాతావరణ మార్పులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరమని నిపుణులు చెబుతున్నారు.

# వర్చువల్ కుదరదు కోర్టుకు హాజరు కావాల్సిందే

హైదరాబాద్, మహా : సంధ్య థియేటర్ ఘటనలో అల్లు అర్జున్‌కు మరో షాక్ తగిలింది. ఈ కేసులో విచారణకు ఆన్ లైన్ ద్వారా హాజరవుతానన్న బన్నీ అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. కోర్టుకు రావాల్సిందేనని స్పష్టం చేసింది. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్ 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ముంబైలో షెడ్యూల్ జరుగుతోంది. భద్రతా కారణాలు, మూవీ షూటింగ్ నేపథ్యంలో వర్చువల్ (ఆన్ లైన్) ద్వారా కోర్టు విచారణకు హాజరయ్యేందుకు అనుమతించాలని బన్నీ నాంపల్లి కోర్టును అభ్యర్థించారు. అయితే, అలా కుదరదని కచ్చితంగా కోర్టు ముందు హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది న్యాయస్థానం. దీంతో ఆయన సోమవారం బన్నీ నాంపల్లి కోర్టుకు హాజరు కానున్నారు. దీంతో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఏ11గా బన్నీ**

ఈ కేసులో బన్నీని పోలీసులు ఏ11గా చేర్చారు. ఏ1 నుంచి ఏ10 వరకూ నిందితులుగా సంధ్య థియేటర్ యాజమాన్యం ఉంది. ఇప్పటివరకూ 23 మందిని నిందితులుగా చేర్చిన పోలీసులు ఛార్జ్ షీట్ ఫైల్ చేశారు. మొత్తం 19 మందికి సమన్లు జారీ అయ్యాయి. 2024, డిసెంబర్ 4న పుష్ప 2 ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా... ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడ్డాడు. అభిమానులతో కలిసి ప్రీమియర్ షో చూసేందుకు వెళ్లిన బన్నీని చూసేందుకు ఫ్యాన్స్ ఒక్కసారిగా దూసుకురావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనకు యాజమాన్యంతో పాటు బన్నీని కూడా బాధ్యున్ని చేస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు.



ఘటన తర్వాత బాధిత కుటుంబానికి అల్లు అర్జున్‌తో పాటు మూవీ టీం అండగా నిలిచింది. బాలుడు శ్రీతేజ్ ప్రస్తుతం కోలుకుంటున్నాడు. వైద్య సాయంతో పాటు ఫ్యామిలీకి కూడా సాయం అందించారు.

# తెలంగాణ అమరవీరుల స్తూపం కరపత్రం ఆవిష్కరణ...

**యాదాద్రి భువనగిరి జూన్ 20 మహా**

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ & మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు దనసరి సీతక్క, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా జూన్ 21 చలో డిండి చింతపల్లి తెలంగాణ అమరవీల స్థూపం ఆవిష్కరణ, ర్యాలీ బహిరంగ సభ జయప్రదం చేయాలని కరపత్రాన్ని శనివారం తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎర్ర జాన్సన్ యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో ఆవిష్కరింప చేశారు





# మళ్లీ యుద్ధ మేఘాలు.

**ఢిల్లీ, మహా** : పశ్చిమాసియాలో శాంతి ఒప్పందాలు జరిగినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉద్రిక్తతలు మరోసారి అత్యంత తీవ్రరూపం దాల్చాయి. లెబనాన్ భూభాగంపై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) నిరంతరాయంగా దాడులు కొనసాగిస్తుండటం అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఈ పరిణామాలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన అంతర్జాతీయ జలమార్గం 'హోర్ముజ్ జలసంధి'ని తాము అన్ని రకాల నౌకా రవాణాకు పూర్తిగా మూసివేసినట్లు ఇరాన్ సంచలన ప్రకటన చేసింది. అయితే, ఇరాన్ చేసిన ఈ వ్యాఖ్యలను అగ్రరాజ్యం అమెరికా తోసిపుచ్చింది. ప్రస్తుతం ఆ జలమార్గం గుండా నౌకల రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయని, జలసంధి తెరిచే ఉందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పష్టం చేశారు.లెబనాన్‌లోని నబతియెహ్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు, అత్యాధునిక డ్రోన్లతో విరుచుకుపడ్డాయి. ఈ భీకర దాడుల ధాటికి అక్కడి పౌరుల నివాస భవనాలు నేలమట్టమయ్యాయి. ఈ వైమానిక దాడుల కారణంగా కనీసం ఐదుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పెద్ద సంఖ్యలో స్థానికులు తీవ్రంగా గాయపడినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ దాడులను తీవ్రంగా పరిగణించిన ఇరాన్ సైనిక నాయకత్వం.. ఇజ్రాయెల్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. తాజా పరిణామాలు తమ తొలి ప్రతిస్పందన మాత్రమేనని, ఇజ్రాయెల్ గనుక తన దూకుడును తగ్గించుకోకపోతే భవిష్యత్తులో మరింత తీవ్రమైన సైనిక చర్యలు ఉంటాయని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) హెచ్చరించింది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధి వైపు ఏ నౌకలూ రాకూడదని ఐఆర్‌జీసీ ఆంక్షలు విధించింది. ఈ వ్యూహాత్మక జలమార్గాన్ని మూసివేయడం ద్వారా అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌ను దెబ్బతీయాలని ఇరాన్ భావిస్తోంది. అయితే, ఇరాన్ హెచ్చరికలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తక్షణమే స్పందించారు. హోర్ముజ్ జలసంధిని మూసివేసినట్లు క్షేత్రస్థాయిలో ఎలాంటి ఆధారాలూ లేవని ప్రపంచ దేశాలకు భరోసా ఇచ్చారు. చమురు మోసుకెళ్లే కార్గో నౌకల ప్రయాణం యథావిధిగా కొనసాగుతోందని, పశ్చిమాసియాలోని తాజా పరిస్థితులను అమెరికా రక్షణ విభాగం అత్యంత నిశితంగా గమనిస్తోందని చెప్పారు. ఉద్రిక్తతలను తగ్గించేందుకు ఇరాన్ దౌత్యవేత్తలతో తాము నిరంతరం చర్చలు జరుపుతున్నట్లు జేడీ వాన్స్ వెల్లడించారు.

# 16 రకాల కాంబినేషన్ ఔషధాలపై కేంద్రం కొరడా.

- తక్షణమే నిషేధం అమలు.
- స్పష్టం చేసిన ఆరోగ్య మంత్రిత్వ శాఖ.



**హైదరాబాద్, మహా**: వైద్యపరంగా సరైన ఆధారాలు లేని, రోగుల చికిత్సలో ఎలాంటి ప్రత్యేక ప్రయోజనం చేకూర్చని 16 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్ ఔషధాలపై కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఈ మందుల తయారీ, అమ్మకం, పంపిణీపై తక్షణమే నిషేధం విధిస్తూ కఠిన చర్యలు చేపట్టింది. ఔషధాలు, సౌందర్య సాధనాల చట్టం కింద కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శనివారం ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.రెండు లేదా అంతకంటే ఎక్కువ ఔషధ పదార్థాలను ఒకే మాత్ర లేదా సిరప్ రూపంలో కలిపి తయారు చేయడాన్ని వైద్య పరిభాషలో 'ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్' (ఎఫ్‌డీసీ) అంటారు. అయితే, తాజాగా నిషేధించిన ఈ 16 రకాల కాంబినేషన్లు పూర్తిగా అహేతుకమైనవని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. వీటి వల్ల రోగులకు అదనపు ప్రయోజనం ఏమీ కలగకపోగా, అనవసరమైన ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని కమిటీ తీవ్రంగా హెచ్చరించింది. ఈ నిపుణుల కమిటీ సమర్పించిన నివేదిక, సిఫార్సుల ఆధారంగానే.. ఈ ఔషధాల వినియోగాన్ని మార్కెట్లో కొనసాగించడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని ప్రభుత్వం నిర్ధారించి ఈ వేటు వేసింది.

తాజాగా నిషేధించిన వాటి జాబితాలో ప్రధానంగా యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మందులు, కడుపునొప్పికి (తిమ్మిర్లు) వాడే మందులతో పాటు కలబంద (అలోవెరా) ఆధారిత చర్మ సంబంధిత ఉత్పత్తులు ఉన్నాయి. ముఖ్యంగా అమోక్సిసిలిన్‌తో పాటు సెరాటియోపెప్టిడేస్, లాక్టోబాసిల్లస్ స్పోరోజెనెస్ కలిపిన మందులు, సెఫ్యూరాక్సిమ్ సెరాటియోపెప్టిడేస్, సెఫాడ్రాక్సిల్‌ప్రోబెనెసిడ్, డైసైక్లోమైన్‌పారాసెటమాల్‌క్లిడినియం బ్రోమైడ్‌క్లోర్డియాజెపాక్సైడ్ వంటి పలు కాంబినేషన్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చింది. దేశ ప్రజలకు కేవలం అత్యంత సురక్షితమైన, దుష్ప్రభావాలు లేని, శాస్త్రీయంగా నిర్ధారించిన మందులు మాత్రమే అందుబాటులో ఉండేలా చూడటమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా కేంద్రం స్పష్టం చేసింది. తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న ఫార్మా కంపెనీలు, మెడికల్ షాపులు ఈ మందుల క్రయవిక్రయాలను తక్షణమే నిలిపివేయాల్సి ఉంటుంది.

# పోక్సో కేసులో బండి భగీరథ్ కు ఊరట

**హైదరాబాద్, మహా** : తీవ్ర సంచలనం సృష్టించిన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ పోక్సో కేసు వ్యవహారంలో బిగ్ అప్‌డేట్ వచ్చింది. నెల రోజులకుపైగా చర్లపల్లి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న భగీరథ్‌కు మేడ్చల్ మల్కాజిగిరి కోర్టు షరతులో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇరు పక్షాల న్యాయవాదుల మధ్య కోర్టు హాల్‌లో సుదీర్ఘంగా సాగిన వాదోపవాదాల అనంతరం న్యాయస్థానం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. భగీరథ్‌కు పరీక్షలు ఉన్నాయని చెప్పడంతో జూన్ 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది కోర్టు. ఈ హైప్రొఫైల్ కేసు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ఒక కేంద్రమంత్రి కుమారుడు నిందితుడిగా ఉండటం, కేసులో తీవ్రమైన పోక్సో చట్టం సెక్షన్లు నమోదు కావడంతో పోలీసులు కూడా దీనిని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దాదాపు నెల రోజులపాటు జైలు జీవితం గడిపిన భగీరథ్, లీగల్ ప్రొసీడింగ్స్ పూర్తి చేసుకొని చర్లపల్లి జైలు నుంచి శనివారం విడుదలయ్యారు. హైదరాబాద్ శివారులోని పేట్ బషీర్‌బాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మే 8వ తేదీ రాత్రి పది గంటల సమయంలో బండి భగీరథ్‌పై తొలి ఎఫ్ఐఆర్ నమోదు అయ్యింది. ఒక మైనర్ బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి తల్లి తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ప్రకారం 2025 డిసెంబర్ 31వ తేదీ రాత్రి న్యూ ఇయర్ వేడుకల సమయంలో బండి భగీరథ్, 17 ఏళ్ల తన కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఆరోపించారు. తీవ్రమైన ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ కేసును ప్రాథమిక దర్యాప్తు చేసి, నిందితుడిపై బీఎన్ఎస్‌లోని సెక్షన్ 74, సెక్షన్ 75తోపాటు పోక్సో యాక్ట్ 2012లోని సెక్షన్ 11, 12 కింద కేసు నమోదు చేశారు.

**నెలరోజులకుపైగా జైల్లోనే**

కేసు నమోదు కాగానే రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేగింది. ఈ కేసు విచారణ కోసం డీసీపీ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు అయ్యింది. బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన అనంతరం పోలీసులు చట్టపరమైన చర్యలను తీసుకున్నారు. అప్పుడు భగీరథ్ ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అయితే అక్కడ ఉపశమనం లభించలేదు. దీంతో మే 16వ తేదీన పేట్‌బషీరాబాద్ పోలీసులు భగీరథ్‌ను అరెస్టు చేసి మేడ్చల్ మల్కాజ్‌గిరి కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో అధికారులు అతనిని చర్లపల్లి సెంట్రల్ జైలుకు పంపించారు. ఆ తర్వాత రిమాండ్‌ను మరింత పొడిగించంతో దాదాపు నెలరోజులకుపైగా అతను జైల్లో ఉండాల్సి వచ్చింది. ఇప్పుడు ఇంజినీరింగ్ పరీక్షలు ఉన్నాయని కోర్టుకు విన్నవించుకోవడంతో మధ్యంతర బెయిల్ ఇస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జూన్ 26 వరకు బండి భగీరథ్ ఇంటి వద్ద ఉండనున్నారు. దీనికి సంబంధించి కోర్టు కొన్ని షరతులను విధించింది.

# యోగా ఒక మతానికి పరిమితం కాదు



**హైదరాబాద్, మహా** : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ యోగా ఉత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు... యోగా విశిష్టతపై అత్యంత స్పష్టమైన, కీలకమైన వ్యాఖ్యలు చేశారు. యోగాను ఒక మత కోణంలో చూసే వారిపై ఆయన తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. యోగా అనేది ఏ ఒక్క మతానికో, వర్గానికో పరిమితమైంది కాదని... దానికి మతాన్ని ఆపాదించి చూడటం ముమ్మాటికీ మూర్ఖత్వమే అవుతుందని స్పష్టం చేశారు. "ప్రపంచానికి భారతదేశం అందించిన అత్యంత గొప్ప అమూల్యమైన కానుక యోగా. ఇది కేవలం వ్యాయామం కాదు.. మనిషిని సమగ్ర మనిషిగా మార్చే అద్భుత సాధనం. మానవ చైతన్యానికి, సర్వమానవ సౌభ్రాతృత్వానికి ఇదొక నిదర్శనం. మానసిక ఒత్తిడిని దూరం చేసి, గుండె నిబ్బరాన్ని, ఆధ్యాత్మిక స్థైర్యాన్ని ఇచ్చే ఈ జీవన విధానాన్ని మన పూర్వీకులు మనకు అందించారు. ప్రకృతి ఒడిలో జీవిస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అనే మాటను ప్రతి ఒక్కరూ నిజం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ... విశ్వవ్యాప్తంగా యోగాకు వస్తున్న గుర్తింపు మన దేశానికి గర్వకారణమన్నారు. యోగా అనేది మన ప్రాచీన సంస్కృతిలో ఒక భాగమని, నేటి ఆధునిక కాలంలో ప్రతి ఒక్కరికీ శారీరక, ఆరోగ్య చింతన ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ, ప్రధాని మోదీ చొరవతోనే 12 సంవత్సరాల క్రితం యోగాకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని, నేడు ప్రపంచ దేశాలన్నీ యోగాను అనుసరిస్తున్నాయని గుర్తు చేశారు. డిప్రెషన్ లాంటి సమస్యలను దూరం చేయడానికి యోగా అద్భుతంగా పనిచేస్తుందని, పిల్లల నుండి పెద్దల వరకు అందరూ దీనిని రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఫరేడ్ గ్రౌండ్ లో 1డే కౌంట్ డౌన్ ఈవేంట్ లో భాగంగా యోగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడులతో పాటు పలువురు హాజరయ్యారు. ఈ యోగా మహోత్సవానికి నగర నలుమూలల నుండి యువతీ యువకులు, విద్యార్థులు, మహిళలు మరియు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. వేదిక ప్రాంగణమంతా యోగా సాధకులతో కిక్కిరిసిపోయింది. కులమతాలకు అతీతంగా అందరూ భాగస్వాములు కావాలని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపు నిచ్చారు. యోగా సాధన ద్వారా మానసిక దృఢత్వానికి సామాజిక ఆవశ్యకతపై వివరించారు. భారత ప్రాచీన యోగాను ప్రపంచానికి పరిచయం చేసి అంతర్జాతీయ స్థాయిలో విశేషా ప్రచుర్యం కల్పించిన వ్యక్తి ప్రధాని మోదీ అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. యోగా దినోత్సవ నేపథ్యాన్ని, ప్రధాని నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో జరుగుతున్న యోగా ఉత్సవాల విశిష్టతను వివరించారు.

మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ మాట్లాడుతూ, దేశ యువత సంపూర్ణ ఆరోగ్యానికి యోగాసనాలు అత్యంత అవసరమన్నారు. భారత దేశ ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలలో యోగా ఒక భాగమని, ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు స్వీకరించిన తర్వాతే, మన దేశ సంపదైన యోగాను ప్రపంచ దేశాలన్నింటికీ పరిచయం చేశారన్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా యోగా వేడుకలను ఘనంగా జరుపుకోవడం ప్రతి భారతీయుడికి ఎంతో సంతోషాన్నిచ్చే విషయమన్నారు. యువతకు శారీరక, మానసిక దృఢత్వానికి యోగ అవసరం దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, నేటి యువత మానసికంగా ప్రశాంతంగా, శారీరకంగా దృఢంగా ఉండాలంటే నిత్యం యోగాసనాలు వేయడం ఎంతో అవసరమన్నారు. యువత ఒత్తిడిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారేందుకు యోగా ఒక అద్భుత సాధనంగా ఉపయోగపడుతుంది. ప్రతి ఒక్కరూ యోగాను అలవాటు చేసుకొని ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు.

# పవన్ ను బూచిగా చూపి తెలంగాణలో పాగాకు బీజేపీ ప్లాన్

**పవన్ ను బూచిగా చూపి తెలంగాణలో పాగాకు బీజేపీ ప్లాన్ టీ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, మహా** : పవన్ కళ్యాణ్‌ను బూచిగా చూపి తెలంగాణలో పాగా వేయాలని బీజేపీ చూస్తోందని, అయినప్పటికీ ఆ పార్టీకి రాష్ట్రంలో స్థానం లేదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. తెలంగాణలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. శాశ్వతంగా అధికారంలోకి ఉండటం కోసం ఎంతకైనా తెగిస్తున్నారని, బీజేపీ చెప్పిందే రాజ్యాంగం అన్నట్టు వ్యవహరిస్తున్నారని మహేశ్ కుమార్ గౌడ్ విరుచుకుపడ్డారు. ప్రాంతీయ పార్టీలను చీల్చి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. విశ్వవిద్యాలయాల్లోకి దూరిన బీజేపీ రఘుపతి రాఘవ రాజారాం పేరు స్థానంలో గాడ్సే జపం చేస్తోందని ధ్వజమెత్తారు. గాడ్సే రాజ్యం స్థాపన వ్యూహంతో సొంత ఎజెండాను తీసుకొచ్చిన కమలం పార్టీ జనాలపై రుద్దుతుందని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఊదరగొట్టిన బీజేపీ ఇప్పుడు ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతోందని, 90 శాతం సంపద బీజేపీ నాయకుల అనుచరుల చేతిలో ఉందని ఆరోపించారు. ఆర్ఎస్ఎస్ భావజాలం కలిగిన వ్యక్తులు వర్సిటీల్లోకి దూరి వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని మహేష్ కుమార్ గౌడ్ మండిపడ్డారు.

సరిహద్దుల్లో భారత భూభాగంలోకి చైనా చొచ్చుకొస్తుంటే ఆ విషయం గురించి బీజేపీ నోరెత్తడం లేదని, లోక్‌సభలో తమ నాయకుడు రాహుల్ గాంధీ ఈ విషయాన్ని ఫోటోలతో సహా చూపించారని పేర్కొన్నారు. అంతేకాదు, గాంధీ కుటుంబం త్యాగానికి మారుపేరని, గాంధీ, నెహ్రూల గురించి బీజేపీ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం కోసం ఇందిర గాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలు అర్పించారని పీసీసీ చీఫ్ గుర్తు చేశారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ అంశం గురించి ప్రస్తావిస్తూ ఈ విషయంలో దుర్మార్గంగా వ్యవహరించారని, అసలు కేసు లేకుండా నామినేషన్ తిరస్కరించిన రిటర్నింగ్ ఆఫీసర్‌ను ఉరి తీసినా తప్పులేదన్నారు. అంతేకాదు, ఝార్ఖండ్‌లో మాత్రం అంబానీలకు చెందిన వ్యక్తికి సరైన పత్రాలు లేకపోయినా మరోసారి అవకాశం ఇచ్చారని ఆయన ఆరోపించారు. దేవుడు పేరు చెప్పకుండా గెలిచే దమ్ము బీజేపీ నేతలకు ఉందా? అని మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. ఉదయం లేస్తే దేవుడి పేరు జపం చేస్తారన్నారు. లౌకిక వాదం ఉన్న వారి ఓట్లు తొలగించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

# సీతమ్మసాగర్ పేరిట వేలకోట్ల ఇసుక దోపిడీ: కవిత

**వరంగల్, మహా బ్యూరో** :సీతమ్మసాగర్ ప్రాజెక్టు ముంపు ప్రాంతం పేరిట భారీ స్థాయిలో ఇసుక దోపిడీ జరుగుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకే మంత్రుల సహకారంతో సుమారు 70 కిలోమీటర్ల మేర అక్రమ ఇసుక తవ్వకాలు సాగుతున్నాయని విమర్శించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ కోసం పోరాడిన మహనీయుల నేల వరంగల్ అని పేర్కొంటూ, కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు.వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీ ప్రాంతాలకు తెలంగాణ ఏర్పడిన తర్వాత చెప్పుకోదగ్గ విద్యాసంస్థలు రాలేదని, ఎంజీఎం ఆస్పత్రి, కాకతీయ విశ్వవిద్యాలయం వంటి కీలక సంస్థలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కేయూలో హాస్టళ్లు, నియామకాల సమస్యలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.సీతమ్మసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల గోదావరి పరివాహక ప్రాంతం తీవ్రంగా దెబ్బతింటోందని, ఆదివాసీలు ఎన్జీటీలో ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతులు, యువత, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ఈ సందర్భంగా పార్టీ 'పాంచజన్యం' పేరుతో విద్య, వైద్యం, సామాజిక న్యాయం, ఉపాధి, యువత సాధికారత వంటి ఐదు ప్రధాన అంశాలతో ప్రజల్లోకి వెళ్తామని కవిత తెలిపారు.పవన్ కళ్యాణ్‌పై స్పందిస్తూ సినీ నటులను వినోద రంగానికి పరిమితంగానే చూడాలని, నటనకు రాజకీయాలకు తేడా ఉందని యువత గుర్తించాలని సూచించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే రాజకీయాలకే ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# హిళలు ఆర్థికంగా సంపన్నులు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ధ్యేయం

- **మహిళా శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ మంత్రి సీతక్క**



**యాదాద్రి భువనగిరి జూన్ 20 మహా** : మహిళలు ఆర్థికంగా సంపన్నులైతే , రాష్ట్రం సుసంపన్నంగా ఉంటుందని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు.శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండల కేంద్రం లో నూతన దుర్గా భాయ్ మహిళా శిశు వికాస కేంద్రం ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి , శాఖ మంత్రి దనసరి.సీతక్క, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామే రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్ పర్సన్ బంద్రు శోభారాణి , జిల్లా అనురాగ్ జయంతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మంత్రి సీతక్క మాట్లడుతూ అంగన్వాడీ టీచర్స్ కి గతంలో లేని విధంగా 61 సంవత్సరం వచ్చిన వారిని రిటైర్డ్ చేయడం జరిగింది. అంగన్వాడి టీచర్ల సమస్యలను తెలుసుకొని వాళ్ల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.ముఖ్యమంత్రి ఆలోచన మేరకు ఆడపడుచులకు పెట్రోల్ బంకులు, గోడౌన్, సోలార్ ప్లాంట్ లు మహిళ లకే ఇవ్వాలను ముఖ్యమంత్రి గారి ఆలోచన అని అన్నారు...

గతంలో 60 సంవత్సరాలు దాటిన మహిళలకు సమభావన సంఘంలో చోటు ఉండేది కాదని, ఇప్పుడు 60 సంవత్సరంములు దాటినా వారికి మహిళ సంఘము ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి ఆడబిడ్డల గురించి అలోచించి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారు.మహిళా సంఘములో ఉండి మహిళ లోన్ తీసుకొని చనిపోతే రెండు లక్షల లోన్ భీమా సౌకర్యం కల్పించడం జరిగిందని అన్నారు. మహిళల కోసం 5 లక్షలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగింది, రాష్టంలో 61 వేలకోట్లరూపాయలు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.మహిళ సంఘాలకు ఆలేరు నియోజకవర్గానికి 1250 కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణాలు మహిళలకు ఇవ్వడం జరింగిందని మంత్రి తెలిపారు . మహిళలు బస్సు కి ఓనర్ చేయాలనే ఉద్దేశంతో, డ్రైవింగ్ శిక్షణలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో 67 లక్షల మంది మహిళా సంఘాలలో ఉన్నారని, అందులో 12 లక్షల మందికి చదువు రానివారు ఉన్నారని, ఆరు లక్షల మందికి అమ్మకి అక్షరమాల క్రింద చదువు చెప్పించి, పదవ తరగతి లో ఉత్తీర్ణత సాధించరాని తెలిపారు.

భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... ఆలేరు పట్టణంలో దుర్గా భాయ్ మహిళా శిశు వికాస కేంద్రం ఏర్పాటు చేసుకోవడం ఇది మహిళలందరికీ కూడా స్వయం ఉపాధికి ఒక మంచి ఆలోచన చేసినటువంటి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. మహిళల కోసం ఇంత మంచి సెంటర్ ఏర్పాటు చేయడం మహిళలందరినీ ఒక శక్తివంతమైన చేయాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని తదనుగుణంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను అనే ఒక నినాదంతో ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తూ ప్రతి సంక్షేమ పథకం మహిళల పేరున ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోరీశ్వరులను చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ప్రతి మహిళకు ఉపాధి కల్పించి ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.ప్రభుత్వ విప్ ,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ...ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. ప్రభుత్వం ఏ సంక్షేమ పథకం తీసుకొచ్చిన మహిళల పేరునే ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఇంట్లో మహిళా ఆర్థికంగా బలోపేతం అయ్యి ఉంటే ఇంట్లో కుటుంబ సభ్యులందరూ ఆర్థికంగా బలోపేతం అవుతారన్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం పెద్ద పీట వేసి మహిళలు కట్టిన రుణాలు వడ్డీ రుణాలగా తిరిగి మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం మహిళలను ఏ విషయాలలోనూ పట్టించుకోలేదని అదే ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం వచ్చిన తరవాత మహిళా ఆత్మ గౌరవాన్ని పెంచుతూ ప్రతి సంక్షేమ కార్యక్రమం మహిళలతోనే మొదలు పెట్టడం జరుగుతుందన్నారు. మహిళలు బలోపేతం అవ్వడానికి ఆర్టీసీ బస్సు ఓనర్లుగా ప్రభుత్వం మహిళలకు బస్సులు ఇవ్వడం జరిగిందన్నారు. ఆలేరు పట్టణాన్ని అన్ని విధులుగా అభివృద్ధి చేస్తానని ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు హామీ ఇచ్చారు.

రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్పర్సన్ బందు శోభారాణి మాట్లాడుతూ.... ఆలేరు పట్టణంలో ఇంత మంచి దుర్గ భాయ్ మహిళ శిశు వికాస భవనం మహిళల కొరకు కట్టించినందుకు ముందుగా పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల పై ప్రత్యేక దృష్టి పెట్టి మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, మహిళలకు ఈ కేంద్రంలో వివిధ రకాల శిక్షణ తరగతులు నిర్వహించి ఉపాధి కల్పించడం జరుగుతుందన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా ఉపయోగించి మరెన్నో సదుపాయాల కల్పన చేయాలన్నారు.

194 స్వయం సహాయక సంఘాల సభ్యులకు 4,21,00,000 శ్రీనిధి బ్యాంకు లింకేజీ చెక్ ను అందజేశారు.621 స్వయం సహాయక సంఘాలకు 58,58,25,000/ బ్యాంకు లింకేజీ చెక్ ను మహిళాసంఘాల సభ్యులకు అందజేయడం జరిగింది.

ఈ కార్యక్రమం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ లు,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, శిశు సంక్షేమ అధికారి నరసింహారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.





# యాప్‌లపై లాక్ వ్యవస్థకు లీక్

పరీక్షలు సజావుగా జరగాలంటే 'డిజిటల్ లాక్‌డౌన్' తప్పదా? యాప్‌లపై తాత్కాలిక నిషేధాలతో ప్రశ్నాపత్రాల లీకేజీల మహమ్మారిని అడ్డుకోగలమా? సాంకేతికతను బంధిస్తే సరిపోతుందా... వ్యవస్థ లోపల తిష్టవేసిన అవినీతి తిమింగలాలకు ఈ 'లాక్‌డౌన్' అసలైన మెడిసిన్ అవుతుందా? లీకేజీల వెనుక ఉన్న అసలు పాపాత్ములపై ఉక్కుపాదం మోపేదెన్నడు? జాతీయ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తున్న 'నీట్' లీకేజీ బాధ్యత నుండి, కేవలం 'రీ ఎగ్జామ్' అనే వంకతో కేంద్ర సర్కారు చేతులు దులుపుకుందా? దేశ భవిష్యత్తు అయిన యువత రోడ్లెక్కి నిరసనలు తెలుపుతుంటే... ప్రభుత్వం ఆ ఆందోళనలను 'లైట్' తీసుకోవడం ఎంతవరకు సమంజసం? విద్యార్థి లోకాన్ని వేధిస్తున్న ప్రశ్నలపరంపర ఇది. తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన మూసీ ప్రాజెక్టు అడుగులు ముందుకు పడ్డట్లేనా? విపక్షాల విమర్శలు, ఆందోళనల మధ్యే గాంధీసరోవర్ పునరుద్ధరణకు గ్రీన్ సిగ్నల్ రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల ఫలించినట్లేనా? ఇటు ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం రేపిన సాయికృష్ణ లాకప్ డెత్ వ్యవహారం కూటమి ప్రభుత్వానికి అంత సులువుగా చెరిగిపోని మాయని మచ్చగా మారబోతోందా?

**తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**






భారతీయ విద్యావ్యవస్థ, రాజకీయ యంత్రాంగం నేడు ఒక విచిత్రమైన సంధియుగంలో ఉన్నాయి. ఒకవైపు సాంకేతికతతో విశ్వగురువుగా ఎదగాలనే ఆకాంక్ష, మరోవైపు అదే సాంకేతికతను సాకుగా చూపుతూ వ్యవస్థాగత లోపాలను కప్పిపుచ్చే ప్రయత్నం. జాతీయ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తున్న 'నీట్' ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతం నుండి, తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపుతున్న మూసీ పునరుద్ధరణ, లాకప్ డెత్ వివాదాల వరకు అన్నీ ఒకే మూలాన్ని సూచిస్తున్నాయి—అది 'వ్యవస్థాగత జవాబుదారీతనం' కరువవ్వడం. పరీక్షలు సజావుగా జరగాలంటే 'డిజిటల్ లాక్‌డౌన్'యాప్‌లపై తాత్కాలిక నిషేధాలు, ఇంటర్నెట్ బంధనం తప్పదా అనే ప్రశ్న వేధిస్తోంది. సాంకేతికతను బంధిస్తే సరిపోతుందా? లీకేజీల వెనుక ఉన్న అసలు అవినీతి తిమింగలాలను వదిలేసి, కమ్యూనికేషన్ యాప్‌లను లాక్ చేయడం అంటే రోగానికి కాకుండా, రోగికి శిక్ష వేయడమే. ఇది తాత్కాలిక ఉపశమనం శాశ్వత వైఫల్యం. ఇంటర్నెట్ నిలిపివేయడం వల్ల తాత్కాలికంగా సమాచార మార్పిడి ఆగవచ్చు. కానీ, వ్యవస్థ లోపల తిష్టవేసిన 'ఇన్‌సైడర్ లీక్స్' ను ఇది అడ్డుకోలేదు.

లక్షలాది మంది విద్యార్థులు రోడ్లెక్కి నిరసనలు తెలుపుతుంటే, కేవలం రీఎగ్జామ్స్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోవాలని చూడడం యువత ఆకాంక్షలను 'లైట్' తీసుకోవడమే అవుతుంది. ప్రశ్నపత్రం వాట్సాప్‌లోనో, టెలిగ్రామ్‌లోనో ప్రత్యక్షం కావడానికి ముందే... అది స్ట్రాంగ్ రూమ్స్ నుంచో, ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచో లీక్ అవుతోంది. లీకేజీల వెనుక ఉన్న అసలు సూత్రధారులపై ఉక్కుపాదం మోపనంత కాలం, ఎన్ని 'డిజిటల్ తాళాలు' వేసినా వ్యవస్థకు లీకేజీలు తప్పవు. ప్రస్తుత భారత రాజకీయ గమనాన్ని గమనిస్తే, ఇకపై కేవలం 'సమస్యలను దాటవేయడం' లేదా 'తాత్కాలిక ప్రత్యామ్నాయాలు' చూపడం ద్వారా ప్రభుత్వాలు మనుగడ సాగించలేవు.

దేశ జనాభాలో అత్యధిక శాతంగా ఉన్న యువత తమ భవిష్యత్తుతో ఆడుకునే విద్యా లీకేజీలపై గళమెత్తుతున్నారు. రాబోయే రోజుల్లో 'ఉపాధివిద్యా భద్రత'లే ఎన్నికల ప్రధాన ఎజెండా కాబోతున్నాయి. సాంకేతికతను నిషేధించడానికి కాకుండా, బ్లాక్‌చైన్ వంటి అత్యాధునిక సాంకేతికతతో పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచాల్సిన అవసరం ఉంది. కస్టడీ మరణాలు, పేపర్ లీకేజీలపై కేవలం బదిలీలు, విచారణల కమిటీలు కాకుండా... ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా తక్షణ కఠిన శిక్షలు పడినప్పుడే వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం నిలుస్తుంది. పాలకులు మారినా... పాలనా విధానాల్లో జవాబుదారీతనం రానంత కాలం ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన బాధితులుగా మిగిలిపోతారు. తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం 'మూసీ ప్రాజెక్టు' అత్యంత హాట్ టాపిక్‌గా మారింది. విపక్షాల తీవ్ర విమర్శలు, నిర్వాసితుల ఆందోళనల మధ్యే గాంధీసరోవర్ పునరుద్ధరణకు మరియు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు గ్రీన్ సిగ్నల్ రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల ఫలించినట్లే కనిపిస్తోంది. మూసీ పునరుద్ధరణ వ్యూహం ప్రధానంగా హైదరాబాద్‌ను వరదలు, కాలుష్యం నుండి రక్షించడం, అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా మార్చడం అనే లక్ష్యాలు ముడిపడి ఉన్నాయి. ఈ ప్రాజెక్టు కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాదు, రేవంత్ రెడ్డి మార్క్ లీడర్‌షిప్‌కు ఒక అగ్నిపరీక్ష. విపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు దీనిని రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నా, భవిష్యత్ మహానగరాల నిర్మాణంలో హైదరాబాద్ వెనుకబడకూడదనే పట్టుదలతో ముఖ్యమంత్రి ముందడుగు వేస్తున్నారు. మెట్రో టేకోవర్ కు రుణాల మెలికలకు కేంద్రం సహకరించకపోవడం ప్రాజెక్టు విస్తరణకు అడ్డంకిగా మారింది. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిల మధ్య లేఖల వార్ నడుస్తోంది. ఇది కూడా కొలిక్కివస్తే హైదరాబాద్ ప్రగతికి మరో ముందడుగు పడినట్లే.

**ఆంధ్రప్రదేశ్: సాయికృష్ణ వ్యవహారం – కూటమి ప్రభుత్వానికి తలనొప్పి**

ఇటు ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ కృష్ణలంకకు చెందిన గాదె సాయికృష్ణ అదృశ్యం, ఆపై వస్తున్న లాకప్ డెత్ ఆరోపణల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతోంది. పోలీసు కస్టడీలోకి వెళ్లిన ఒక పౌరుడు నెల రోజులుగా కనిపించకుండా పోవడం, తదనంతరం కోర్టుల జోక్యం కూటమి ప్రభుత్వ పరిపాలనపై విమర్శల శరపరంపరాన్ని గుప్పిస్తోంది. పోలీసు అధికారులు కొందరు పాత కక్షలు లేదా రాజకీయ ఒత్తిళ్లతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం 'అరాచకత్వానికి' దారితీస్తుంది. అధికారంలోకి వచ్చిన కొత్తలోనే ఇలాంటి లాకప్ డెత్ ఆరోపణలు రావడం, ప్రతిపక్షాలకు ప్రభుత్వంపై పోరాడటానికి బలమైన ఆయుధాన్ని ఇచ్చినట్లయింది. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల కూటమి ప్రభుత్వానికి ఇది అంత సులువుగా చెరిగిపోని మాయని మచ్చగా మారే ప్రమాదం ఉంది. మావాడు చనిపోతే కనీసం బూడిదైనా ఇవ్వండి అని ఆ కుటుంబం చేస్తున్న ఆర్తనాదాలకు సమాధానం లేదు. వ్యవస్థలోని కొందరు వ్యక్తుల బరితెగింపు ఈ పరిణామం అద్దం పడుతోంది.




> పరీక్షలు సజావుగా జరగాలంటే 'డిజిటల్ లాక్‌డౌన్' తప్పదా? యాప్‌లపై తాత్కాలిక నిషేధాలతో ప్రశ్నాపత్రాల లీకేజీల మహమ్మారిని అడ్డుకోగలమా? సాంకేతికతను బంధిస్తే సరిపోతుందా... వ్యవస్థ లోపల తిష్టవేసిన అవినీతి తిమింగలాలకు ఈ 'లాక్‌డౌన్' అసలైన మెడిసిన్ అవుతుందా? లీకేజీల వెనుక ఉన్న అసలు పాపాత్ములపై ఉక్కుపాదం మోపేదెన్నడు? జాతీయ స్థాయిలో ప్రకంపనలు సృష్టిస్తున్న 'నీట్' లీకేజీ బాధ్యత నుండి, కేవలం 'రీ-ఎగ్జామ్' అనే వంకతో కేంద్ర సర్కారు చేతులు దులుపుకుందా? దేశ భవిష్యత్తు అయిన యువత రోడ్లెక్కి నిరసనలు తెలుపుతుంటే... ప్రభుత్వం ఆ ఆందోళనలను 'లైట్' తీసుకోవడం ఎంతవరకు సమంజసం? విద్యార్థి లోకాన్ని వేధిస్తున్న ప్రశ్నలపరంపర ఇది.

> పరీక్షలు సజావుగా జరగాలంటే 'డిజిటల్ లాక్‌డౌన్'యాప్‌లపై తాత్కాలిక నిషేధాలు, ఇంటర్నెట్ బంధనం తప్పదా అనే ప్రశ్న వేధిస్తోంది. సాంకేతికతను బంధిస్తే సరిపోతుందా? లీకేజీల వెనుక ఉన్న అసలు అవినీతి తిమింగలాలను వదిలేసి, కమ్యూనికేషన్ యాప్‌లను లాక్ చేయడం అంటే రోగానికి కాకుండా, రోగికి శిక్ష వేయడమే.

> లక్షలాది మంది విద్యార్థులు రోడ్లెక్కి నిరసనలు తెలుపుతుంటే, కేవలం రీ-ఎగ్జామ్స్ నిర్వహించి కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పుకోవాలని చూడడం యువత ఆకాంక్షలను 'లైట్' తీసుకోవడమే అవుతుంది.

> ప్రశ్నపత్రం వాట్సాప్‌లోనో, టెలిగ్రామ్‌లోనో ప్రత్యక్షం కావడానికి ముందే... అది స్ట్రాంగ్ రూమ్స్ నుంచో, ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచో లీక్ అవుతోంది. లీకేజీల వెనుక ఉన్న అసలు సూత్రధారులపై ఉక్కుపాదం మోపనంత కాలం, ఎన్ని 'డిజిటల్ తాళాలు' వేసినా వ్యవస్థకు లీకేజీలు తప్పవు.

> పాలకులు మారినా... పాలనా విధానాల్లో జవాబుదారీతనం రానంత కాలం ప్రజాస్వామ్యంలో ప్రజలే అసలైన బాధితులుగా మిగిలిపోతారు.
> విపక్షాల తీవ్ర విమర్శలు, నిర్వాసితుల ఆందోళనల మధ్యే గాంధీసరోవర్ పునరుద్ధరణకు మరియు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు గ్రీన్ సిగ్నల్ రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల ఫలించినట్లే కనిపిస్తోంది.

# ఖాకీల కర్తవ్యం...



**తలపై టోపీ. చేతిలో లాఠీ. ఖాకీ డ్రెస్.. వారు శాంతి భద్రతలకు బాస్. ప్రజలకు రక్షణ కల్పించటం వారి బాధ్యత. శాంతి, భద్రతల పరిరక్షణ వారి కర్తవ్యం. ఒక్క ముక్కలో చెప్పాలి అంటే వారు నిరంతర ప్రజా సేవకులు. వేరే పోలీసులు. వారి కనుసన్నల్లోనే ప్రజలు క్షేమంగా వుంటున్నారు. ఇందులో సందేహం లేదు. పల్లె మొదలుకుని, పట్నం వరకు ఉంటున్న ప్రజలు నిర్భయంగా పగలు, రాత్రి తిరగగలుగుతున్నారు అంటే అది పోలీసుల చలువే. కుటుంబ సభ్యులకు కూడా పూర్తి సమయం కేటాయించే పరిస్థితి లేకుండా 24 గంటలు విధి నిర్వహణలో మమేకం అయ్యే పోలీసులు సమాజంలో ఆ స్థాయి స్థానం మాత్రం సంపాదించుకోలేకపోతున్నారు. ఇందుకు కారణం ఏమిటీ? పోలీస్ వ్యవస్థలో వివిధ స్థాయి సిబ్బంది వుంటారు.**

ఐపిఎస్ అధికారులు ఉన్నత స్థాయి హోదాల్లో కొనసాగుతుండగా, డిగ్రీ స్థాయి అధికారులు కింది స్థాయిలో వుంటారు. హోం గార్డు, సాధారణ పోలీసులలో చాలా మంది ఉన్నత చదువులు లేని వారే ఉంటున్నారు. పై అధికారుల సందేశాలు, సూచనలు, అభిప్రాయాలు, విధానాలు కింది స్థాయిలో అమలు కావటం లేదన్నది అక్షర సత్యం. ముఖ్యంగా ఫ్రెండ్లి పోలీస్ విధానంపై పోలీసు ఉన్నతాధికారులు పూర్తి స్థాయి దృష్టి పెట్టకపోవటం, ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితుల విషయంలో అనుసరించాల్సిన పద్ధతిపై నిర్లక్ష్యం నీడలు కమ్ముకోవటంతో ఇది ఆరంభ శురత్వం అయింది. సామాన్య జనంతో పోలీసులు సఖ్యత ప్రదర్శించక పోవటం వెనుక అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పై అధికారులు కింది స్థాయి సిబ్బందికి సముచిత గౌరవం ఇవ్వక పోవటం, వారి సమస్యలు పట్టించుకోక పోవటం, బాసింగ్ హుకుంలు, విశ్రాంతి ఇవ్వక పోవటం, పని వత్తిడి పెంచటం, అవసరమైన సమయంలో సెలవులు మంజూరు చేయక పోవటంతో కింది స్థాయి సిబ్బంది మానసికంగా, శారీరకంగా అలసిపోతున్నారు. ఈ విరక్తిని ఎవ్వరిపై చూపాలో తెలియని పరిస్థితి వారిది. చివరికి ఇది జనంపైన ప్రభావం చూపే పరిస్థితికి దారి తీస్తోంది. నేరాలు, ఘోరాలు చేసే వారితో మర్యాదగా ప్రవర్తిస్తే కేసులు ముందుకు సాగే అవకాశం ఉండదు అనే భావం ఇప్పుడు పోలీసుల్లో నాటుకు పోయింది. ఇక్కడే వారికి ఇబ్బంది మొదలు అయి చివరికి అది పూర్తిగా పోలీస్ శాఖకు తలనొప్పిగా తయారవుతోంది. పోలీసులు హద్దులు దాటుతున్న సంఘటనలు ఇప్పుడు సంచలనం రేపుతుండగా, కోర్టులు కూడా పోలీసుల బాధ్యతలు, విధులపైన గట్టిగా హెచ్చరికలు చేస్తున్నాయి.

సమాజంలో పోలీస్ శాఖకు ఓ ప్రత్యేక ప్రాధాన్యత వుంది. ప్రజలకు నిరంతరం రక్షణ కవచంగా పోలీస్ వ్యవస్థ నిలుస్తూ వస్తోంది. ఎవరికి అన్యాయం జరుగుతున్నా ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసులే. విపత్తులు, విలయాల సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజల ప్రాణాలకు భరోసా ఇచ్చిన పోలీసులు కోకొల్లలు. శాంతి, భద్రతల పరిరక్షణ వారి అంతిమ లక్ష్యం. ఇంతటి విశిష్టత కలిగిన పోలీస్ శాఖ ఇప్పుడు విమర్శలు, వివాదాలలో ఎందుకు చిక్కుకుంటోంది అనేది అందరికి వచ్చే అనుమానం. అది కొందరి పోలీసుల అత్యుత్సాహం వల్లే. నిందితులను అదుపులోకి తీసుకోవటం, నేర నిరూపణ కోసం అవసరమైన సాక్ష్యాలు సేకరించి కోర్టులకు సమర్పించటం పోలీసుల విధి. ఇక్కడే వారు వత్తిళ్ళకు గురవుతున్నారు. పాలకులు, పలుకుబడి వున్న వ్యక్తులు, నేతలు, హోదాలో వుండే అధికారులు తెచ్చే వత్తిళ్ళు పోలీసులను పూర్తిగా సతమతం చేస్తున్నాయి అనటంలో సందేహం లేదు. రాజకీయ ప్రతీకారాలు కూడా పోలీసులకు పెద్ద సంకటమే అవుతున్నాయి. ఇందుకు నిలువెత్తు సాక్ష్యం ఆంధ్రప్రదేశ్ లో జరిగిన ఘటన. ఎం పీ హోదాలో వున్న నేతపైన పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించటం పెద్ద సంచలనమైంది. కేసు ఇప్పుడు దేశంలోని పోలీస్ వ్యవస్థను పెద్ద ఇరకాటంలో పడేసింది. అప్పట్లో వైసీపీ ప్రభుత్వ పెద్దల వత్తిళ్ళ నేపథ్యంలో ఎంపీ రఘురాం కృష్ణమరాజున కుట్ర కేసులు నమోదు చేసిన పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి చిత్ర హింసలు పెట్టారంటూ అభియోగాలు నమోదయ్యాయి. ఈ వివాదం ఏపీ హైకోర్టుకు చేరింది. కేసులో ఏపీకి చెందిన పలువురు పోలీసు అధికారులు ఇరుక్కున్నారు. విచారణ సమయం ఏపీ పోలీస్ శాఖలో ఉన్నత హోదాలో వున్న ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ మెడ చుట్టూ కూడా ఈ కేసు ఉచ్చు బిగిసింది.

ఆంధ్రప్రదేశ్ లో ఇప్పుడు పోలీసులు పనితీరు పెద్ద చర్చనీయాంశంగా మారింది. విజయవాడ పరిధిలో సాయికృష్ణ అనే యువకుడి అదృశ్యం పోలీసులకు అగ్ని పరీక్షలు తెచ్చి పెడుతోంది. విచారణ పేరుతో సాయికృష్ణను పోలీస్ స్టేషన్ పిలిచిన పోలీసులు అతడ్ని చిత్ర హింసలు పెట్టి చంపేశారంటూ ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇదే పోలీస్ స్టేషన్ లో గతంలో ఓ యువకుడిని పోలీస్ అధికారులు వేధించారని, అతడు సెల్ఫీ వీడియోలో ఘటన వివరాలు చెప్పి ఆత్మహత్య చేసుకున్నాడని కూడా ఇప్పుడు వెలుగులోకి వచ్చిన నిజాలు దుమారం రేపుతున్నాయి. ఈ ఘటనలతో ఉలిక్కి పడ్డ ఏపీలోని కూటమి సర్కార్ దీనిపై నిజానిజాలు వెలికి తీసేందుకు ఉన్నత స్థాయి అధికారులతో విచారణ సాగిస్తోంది. ఇలా తరచుగా పోలీసులు వివాదాల్లో చిక్కుకుపోతూనే వున్నారు. వారి వృత్తి ఇప్పుడు కత్తి మీద సాములా మారిపోయింది. నేరాల అదుపులో పోలీసులు కఠినంగా వ్యవహరించక పోతే అరాచక శక్తులు పెట్రేగి పోతాయి. అప్పుడు కూడా పోలీసులనే నిందిస్తారు. నేరాలు, ఘోరాలు అదుపు చేయాలి అంటే పోలీస్ వ్యవస్థ కొంత గట్టిగానే ఉండాలి. ఇదే సమయంలో కంట్రోల్ తప్పకుండా చూసుకోవాలి. ఇక్కడే పొరపాటు జరుగుతోంది. కోర్టులు విధించాల్సిన శిక్షలు పోలీసులు చేతిలోకి తీసుకొని హద్దులు దాటేస్తున్నారని, అవే కస్టోడియన్ మృతులకు కారణం అవుతున్నాయని న్యాయ నిపుణులు అంటున్నారు. ఓ వ్యక్తిపైన ఆరోపణలు, అభియోగాలు వస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి తమ పరిధిలో పోలీసులు జాగ్రత్తగా విచారణ చేయాలని, కేసుకు సంబంధించిన ఆధారాలు సేకరించి కోర్టులో సదరు అభియోగాలు ఎదురుకుంటున్న ముద్దాయిని హాజరు పర్చాలని, ఇంత వరకే పోలీసుల బాధ్యతని నిపుణులు చెప్తుతున్నారు. ఇప్పుడు ఇందుకు విరుద్ధంగా విచారణ జరుగుతోంది. అభియోగాలు ఎదుర్కొంటున్న వ్యక్తి పైన పోలీసులు బలప్రయోగం చేస్తున్నారు. ఇది హద్దులు దాటితే వారి ఉద్యోగాలకే ప్రమాదం అవుతుందని న్యాయ నిపుణులు హెచ్చరిక చేస్తున్నారు. క్రిమినల్ వ్యవహారాల్లో కింది స్థాయి సిబ్బంది ఎలా వ్యవహరించాలో వివరించి, ఆ మేరకు నిర్ధిష్ట శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత పోలీస్ వున్నతాధికారులపైన ఉందని వారు గుర్తు చేస్తున్నారు. ఈ ప్రక్రియ ఇప్పుడు జరగటం లేదని, అదే సమస్యలకు మూలం అవుతోందని వారు వివరిస్తున్నారు.

కస్టోడియన్ డెత్ లు ఇప్పుడు పెద్ద సంచలనం రేపుతున్నాయి. దీనిపై పోలీసులకు మధ్య ప్రదేశ్ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. అభియోగాలు ఎదుర్కొనే వ్యక్తిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించటం, హింసించటం వంటివి చట్ట విరుద్ధంగా కోర్టు చెప్పుకు వచ్చింది. ఇక కస్టోడియన్ డెత్ జరిగితే అది అత్యంత పెద్ద నేరం అవుతుందని, ఇందుకు బాధ్యులు అయిన వారిపై తక్షణమే కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉందని చెప్పిన కోర్టు ఇందుకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి కూడా అవసరం లేదని వివరించింది. రాజ్యాంగం ప్రతీ వ్యక్తికి జీవించే అవకాశం కలిపించిన విషయం ఇక్కడ కోర్టు గుర్తు చేసింది. పోలీసుల ప్రవర్తన పైన కోర్టులు స్పష్టత ఇస్తున్న నేపథ్యంలో ఆ శాఖ ఉన్నతాధికారుల పైన ఇప్పుడు గురు తర బాధ్యతలు వచ్చి పడుతున్నాయి అనటంలో సందేహం లేదు. ఏయే పోలీస్ స్టేషన్ లో ఎలాంటి కేసులు నమోదు అయ్యాయో, ఎవరిని అదుపులోకి తీసుకున్నారో, వారి పరిస్థితి ఏమిటో, విచారణ పద్ధతి ఎలా జరుగుతోందో పోలీస్ వున్నతాధికారులు తప్పని సరిగా పర్యవేక్షణ చేయాల్సిందే. లేకపోతే తిప్పలు తప్పవు.

పోలీస్ శాఖపైన రాజకీయ వత్తిడి అధికంగా ఉంటోంది అనేది బహిరంగ రహస్యం. ముఖ్యంగా ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పాలసీ, ఆ పార్టీ నేతల మాట పోలీస్ స్టేషన్లో చలామణి అవుతుంది. ఇదే పోలీస్ ల తప్పులకు అసలు కారణం అనేది చాలా మంది అభిప్రాయం. నిజం కూడా అదే. ఇక రోజు వారీ శాంతి, భద్రతలు, పాలకులు అధికారులు, ప్రతి పక్ష నేతల పర్యటనలు, ఆందోళనలు ఇతర బందోబస్త్ వంటి విధులు, రోజువారీ ఫిర్యాదులు, ట్రాఫిక్ నియంత్రణ భారం పోలీసులను ఉక్కిరి, బిక్కిరి చేస్తూనే వున్నాయి. ఇవే వారి విపరీత మానసిక పరిస్థితికి కారణం అవుతున్నట్లు ఓ సర్వే తేల్చింది. సదరు కానిస్టేబుల్ తన కుటుంబంతో వారం 16 గంటలు కూడా గడపటం లేదని, సరదాగా జీవితం సాగించే సమయం 97 శాతం మేరకు పోలీస్ శాఖ సిబ్బందిలో లేకుండా పోయిందని చెప్పిన ఆ సర్వే దీని వల్ల పోలీస్ సిబ్బందిలో కరకు స్వభావం నానాటికి ఎక్కువ అవుతుందని వివరించిన సర్వే పై అధికారుల బాసీజం కూడా పోలీస్ సిబ్బంది ఇబ్బందికి ఓ మూలంగా తెలిపింది. వీటికి పరిష్కారం చూపించినప్పుడే ఆ శాఖ సిబ్బందిలో మార్పు వస్తుందని సూచనలు చేసింది. వీటిని పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఇదే పోలీసుల కర్తవ్యం గాడి తప్పేలా చేస్తున్నాయని నిపుణులు అంటున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన పోలీస్ శాఖ వివాదాల నుంచి బయట పడాలి అంటే కచ్చితంగా మార్పులు, చేర్పులు అవసరం. ఈ దిశగా పాలకులు, అధికారులు అడుగులు వేస్తే పోలీస్ సిబ్బందితో పాటు ప్రజలు ఉపశమనం పొందుతారు.



**జీ. వెంకటరమణ.**
**సీనియర్ జర్నలిస్ట్**



## నిత్యం యోగ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం

**మందమర్రి, మహా** : నిత్యం యోగ చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మందమర్రి ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎం తన కార్యాలయం ఆవరణలో ఎస్ ఓ టు జి ఎం ప్రసాద్, సింగరేణి గుర్తు ప్రసంగం ఏఐటియుసి మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సి ఎం ఓ ఏ ఐ జాయింట్ సెక్రటరీ రవి, డీజీఎం పర్సనల్ సిహెచ్.అశోక్, సీనియర్ పిఓ సత్య నారాయణ, ఫిట్ కార్యదర్శి గీతిక, యోగా మాస్టర్ ముల్కాల శంకర్ లతో కలిసి యోగాసనాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ మందమర్రి ఏరియాలోని వివిధ గనులు, డిపార్ట్ మెంట్ లలో యోగబ్యాసం గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ దినోత్సవం నా చేతుల మీదుగా ఇక్కడ జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. యోగ ద్వారా మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం సిద్ధిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగులందరూ ఆరోగ్యంగా ఉంటేనే సంస్థ మరింత ప్రగతి సాధిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో ఏరియాలోని వివిధ విభాగాల అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు జిఎం కార్యాలయ సిబ్బంది పాల్గొని యోగ ప్రతిజ్ఞ చేశారు.

## ఈఎస్ఐ ఆస్పత్రిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**కుషాయిగూడ, మహా :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నాచారంలోని ఈఎస్ఐ ఆస్పత్రిలో శనివారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ అధికారులు, కార్యాలయ సిబ్బంది, పారా మెడికల్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, ఆర్ఎంఓ 1 డాక్టర్ వీణారాణి, డాక్టర్ సంజీవరావు హాజరయ్యారు. యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా అనేక రకాల అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని వారు తెలిపారు. ఆయుష్ వైద్యులు డాక్టర్ రాజరాజేశ్వరి, డాక్టర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో యోగా ఆసనాలు, ప్రాణాయామం నిర్వహించారు. సిబ్బందికి యోగా



ప్రాధాన్యతను వివరించి, ఆరోగ్యకర జీవనశైలిలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.



## కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను బిచ్చగాళ్లను చేస్తుంది

**యాదాద్రి భువనగిరి జూన్ 20 మహా** :బిఆర్ఎస్ ప్రభుత్వం లో సీఎం కేసీఆర్ రైతునుశ రాజును చేస్తే రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను బిచ్చగాళ్లు చేస్తుందని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు... యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు గెస్ట్ హౌస్ లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు బిఆర్ఎస్ ప్రభుత్వంలో హయంలో రైతుల కల్లాల వద్దకు వెళ్లి మద్దతు ధరకు వడ్లు కొనుగోలు చేస్తే ఈ ప్రభుత్వంలో ఇప్పటివరకు ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద వడ్లు కొనుగోలు చేయక ములుగుతున్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు ప్రతి వడ్ల కొనుగోలు కేంద్రంలో వద్ద రైతులు ఇప్పటికీ వడ్లు నిల్వలతో పడికాపులు కాస్తున్నారని అన్నారు.. రైతు భరోసా కరెక్ట్ గా ఇవ్వారని, యూరియా కరెక్ట్ గా ఇవ్వరని, వడ్లు కరెక్టుగా కొనుగోలు చేయారని రైతులను ఈ ప్రభుత్వం అరిగోస పెడుతుందని విమర్శించారు.. రైతుకు రైతు బీమా కూడా ప్రభుత్వ ఇప్పటికి చెల్లించలేదని రైతు సమస్యల పరిష్కారానికై బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేయక తప్పదని ఆమె హెచ్చరించారు... పోలీసులు బిఆర్ఎస్ కార్యకర్తల, నాయకుల పై తప్పుడు కేసులు పెట్టి బెదిరిస్తున్నారని ఆమె ఆరోపించారు. విలేకరుల సమావేశంలో ఆలేరు మున్సిపల్ కౌన్సిలర్ యాట శివ, బి ఆర్ ఎస్ నాయకులు పుట్ట మల్లేష్, మొరిగాడి వెంకటేష్, ఆడెపు బాలస్వామి, పంతం కృష్ణ తదితరులు ఉన్నారు.

## పర్మిషన్ లేకుండా నడుపుతున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- పలగొర్ల మోదీరాందేవ్

**భువనగిరి జూన్ 20 మహా న్యూస్** జిల్లాలో పర్మిషన్ లేకుండా నడుపుతున్న పాఠశాలలపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పలగొర్ల మోది రాందేవ్ అన్నారు శనివారం చౌటుప్పల్ మండల కేంద్రంలోని త్రీనీటి విద్యా సంస్థ యాజమాన్యం విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తే నా ఎనక అధికారులు ఉన్నారు పర్మిషన్ లేకుండా స్కూల్ నడుపుతా అంటూ బెదిరింపులకు దిగుతూ ఫీజుల పేరుతో విద్యార్థుల రక్తం తాగుతున్న విషయంపై డిఇఓ కి బీసీ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారని ఆయన అన్నారు అలానే ఎంఈఓ గురువయ్య వారి బృందాన్ని పంపి పర్మిషన్ లేని త్రినేటి స్కూల్ ను అందులో దొరికిన బుక్స్ సీజ్ చేశారని తెలిపారు శ్రీనిటి యాజమా



న్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని వారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ మనీ ఎడ్ల మహాలింగం నిరంజన్ గౌడ్ మల్లయ్య భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారిని దర్శించుకున్న మంత్రి సీతక్క

- యాదాద్రి భువనగిరి జూన్ 20 మహా

**యాదాద్రి భువనగిరి జిల్లా** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని శనివారం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సితక్క,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రి సీతక్కకు ఘన స్వాగతం పలికి ఆశీర్వచనం అందజేశారు మంత్రి వెంట రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ బి. శోభారాణి స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- సింగరేణిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**భద్రాద్రి బ్యూరో, మహా**:యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు పాఠశాల విధ్యార్థినీ విద్యార్థులతో సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా జిఎం(క్వాలిటి) సిహెచ్.వెంకట రమణ, జిఎం(ఓసిపి) పి.ఎలిషా, జిఎం(పర్సనల్) ఈఈ అండ్ ఆర్‌సి ఏజేఎం మురళిధర రావు, గుర్తింపు సంఘం (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం(ఐఎన్‌టియూసి) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, కార్పొరేట్ సిఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎస్. వెంకటా చారిలు పాల్గొని ప్రసంగించారు. మన భారతదేశంలో పుట్టినటువంటి యోగా అంతర్జాతీయంగా గుర్తించబడి మానవాళికి ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగ పడుతుందని యోగాని అన్ని దేశాలకు విస్తరించాలనే ఉద్దేశంతో ప్రతీ సంవత్సరం జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని అన్నారు. ఈ సంవత్సరం ప్రపంచ వ్యాప్తముగా ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే నినాదం తో నిర్వహించుకుంటున్నామని దీని ద్వారా ప్రతీ వ్యక్తి యొక్క ఆరోగ్యం దాని వల్ల కుటుంబం కుటుంబం వల్ల సమాజం అందరూ శారీరకముగా మానసిక




ముగా బాగుంటారని అన్నారు. గత 12 సంవత్సరాలుగా సింగరేణి సంస్థ యోగాకు పూర్తి సహకారం అందిస్తూ ప్రోత్సహిస్తోందని దీని కొరకు ప్రత్యేకముగా బడ్జెట్ ను కూడా కేటాయించి యోగాను నిరంతరాయంగా ఆచరించడం కోసం యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని కార్మికులు కూడా యోగాను ఆచరిస్తూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని వారు పిలుపునిచ్చారు. ఈ యోగా ఆచరణతో వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు పని సామర్థ్యం మెరుగవుతుందని తద్వారా ఉద్యోగుల కుటుంబాలకు కంపెనీకి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. యోగా వల్ల బీపీ మధుమేహం వంటివి నియంత్రణలో ఉంటాయని ముఖ్యంగా ఎక్కువ సేపు కూర్చుని పనిచేసే ఉద్యోగులు పని ఒత్తిడికి గురి అయ్యేవారు రోజుకు కనీసం 30 నిమిషాలపాటు యోగా సాధన చేయడం వల్ల పూర్తిస్థాయి ప్రయోజనం పొందుతారన్నారు. ప్రముఖ శాస్త్రీయ నృత్యకళాకారిణి సీతా ప్రసాద్ బృందంచే యోగాపై నృత్యం చేసి అందరికీ యోగపై అవగాహన కల్పించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా అందరూ కలిసి యోగా ప్రతిజ్ఞ స్వీకరించి సామూహిక యోగాసనాలు వేశారు. జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & సిఎస్ఆర్ శ్రీ జి.వి.కిరణ్ కుమార్ గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణరావు, బి.శివ కేశవరావు, ముకుంద సత్యనారాయణ, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, వివిధ శాఖల అధిపతులు, ఉద్యోగులు, ఇతర అధికారులు, ఎస్ అండ్ పిసి, స్కౌట్స్ అండ్ గైడ్స్, సింగరేణి మహిళా కళాశాల నర్సింగ్ కళాశాల విధ్యార్థినులు యోగా మాస్టర్లు పాల్గొన్నారు.



## మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్...

**రాజేంద్రనగర్ మహా :** రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన ధ్యేయ అని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.జీహెచ్ఎంసీ, రాజేంద్రనగర్ సర్కిల్ 11 పరిధిలోని అత్తాపూర్ (సీ20) డివిజన్లలో(1,45,లక్షలు) అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు సీసీ రోడ్ల డ్రైనేజీ నిర్మాణ పనులకు జిహెచ్ఎంసి అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శనివారం ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలను చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని బస్తీలోని ప్రతి గల్లీని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాంట్రాక్టర్లు, పార్టీ నాయకులు కాలనీల అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## యోగ సంబరాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**యాదాద్రి భువనగిరి జూన్ 20 మహా** యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి పట్టణంలోని బోధిధర్మ యోగ అండ్ హెల్త్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ప్రపంచ యోగ సంబరాలలో భాగంగా బాలాజీ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని యోగా చేశారు ఈ సందర్భంగా వివిధ ఆసనాలను ఆయన స్వయంగా వేశారు. అనంతరం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలోని పదో తరగతి పరీక్షలలో మొదటి స్థానాన్ని సాధించిన విద్యార్థులందరికీ ప్రత్యేక మెమొంటోల్లు అందజేశారు... అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతినిత్యం యోగా చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు వీరితోపాటు మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి..!

- ఆర్ఐ జీపీఓపై దాడిని ఖండించిన ట్రెసా
- తుర్కయంజాల్ లో ఉద్యోగులపై దాడి హేయమైన చర్య
- ట్రెసా రాష్ట్ర కార్యదర్శి గౌతమ్ కుమార్
- రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎస్ జనార్ధన్ రావు




**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా**: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ పరిపాలన అధికారి (జీపీఓ)పై శుక్రవారం జరిగిన దాడిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా), రంగారెడ్డి జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ విధులను నిర్వహిస్తున్న అధికారులపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని, ఇటువంటి సంఘటనలు ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు ముప్పుగా మారడంతో పాటు చట్టబద్ధమైన పరిపాలనకు ఆటంకం కలిగిస్తాయని ట్రెసా పేర్కొంది. ప్రజలకు సేవలందించే క్రమంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై దాడులు జరగడం సహించరానిదని సంఘం అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సంఘం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌ను కలిసి కింది అంశాలపై తక్షణ చర్యలు **తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది**:

1. దాడికి పాల్పడిన వ్యక్తులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు చేపట్టాలి.
2. ఫీల్డ్ విధులు నిర్వహించే రెవెన్యూ సిబ్బందికి తగిన భద్రతా ఏర్పాట్లు కల్పించాలి.
3. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలి.
4. ప్రభుత్వ ఉద్యోగుల గౌరవం, భద్రత మరియు విధి నిర్వహణకు అవసరమైన రక్షణను ప్రభుత్వం కల్పించాలి.

ప్రభుత్వ ఉద్యోగులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా రెవెన్యూ సిబ్బందిలో భద్రతా భావనను పెంపొందించాలని ట్రెసా జిల్లా శాఖ కోరింది. ఈ కార్యక్రమంలో ట్రెసా రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గౌతమ్ కుమార్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎస్ జనార్ధన్ రావు, కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశానికే ఆదర్శం..!

- కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైంది
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- రైతు భరోసా అమలులో స్పష్టత లేదు
- సర్పంచ్ ఇచ్చిన వినతి పత్రాన్ని పక్కన పెట్టడం...
- పాత భవనానికి రంగులు అద్దిన ఘనత కాంగ్రెసుది
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి




**ఇబ్రహీంపట్నం జూన్ 20 మహా**:ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం మానుకొని, పాలనపై దృష్టి సారించాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్నా, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టి మళ్లించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు.

రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిరెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో వ్యవసాయం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, సంక్షేమం, పారిశ్రామిక రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. పదేళ్ల పాటు తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించిన బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ద్వారా కాంగ్రెస్ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. రైతు సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందని, రైతుబంధు పథకం ద్వారా 72 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించామని, రైతు బీమా పథకం ద్వారా వేలాది రైతు కుటుంబాలకు భరోసా కల్పించామని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ హయంలో దేశంలోనే అత్యధికంగా రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు.

**రైతు భరోసా అమలులో స్పష్టత లేకుండా పోయింది...**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా అమలులో స్పష్టత లేకుండా వ్యవహరిస్తూ రైతులను అయోమయానికి గురిచేస్తోందని విమర్శించారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని పూర్తిగా అమలు చేయకుండా అనేక నిబంధనలు పెట్టి రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికల ముందు చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తర్వాత చేస్తున్న పనులకు పొంతన లేకుండా పోయిందని అన్నారు.

**బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా...**

బీఆర్ఎస్ పాలనలో యాసంగి, వానాకాలం పంటల ఉత్పత్తిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు అందించామని, 24 గంటల ఉచిత నాణ్యమైన విద్యుత్‌ను రైతులకు అందించామని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని మంచిరెడ్డి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో ప్రారంభించిన పబ్లిక్ స్కూల్... మొన్న ముఖ్యమంత్రి చేతులమీదుగా ప్రారంభించిన ఆరుట్ల మోడల్ స్కూల్ నిర్మించింది కేసీఆర్ ప్రభుత్వమని, ఉన్న స్కూల్ కు కలర్ లు వేసి తామే కట్టించినట్టు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే 4సార్లు నియోజకవర్గానికి విచ్చేసిన ముఖ్యమంత్రి ఎన్ని నిధులు కేటాయించారో చెప్పాలని, స్థానిక ఎమ్మెల్యే ఎన్ని నిధులు అడిగారో కూడా నిరూపించాలని కిషన్ రెడ్డి అన్నారు.

**సర్పంచ్ ఇచ్చిన వినతి పత్రాన్ని పక్కన పెట్టడం...**

నియోజకవర్గంలోనే పెద్ద గ్రామమైన ఆరుట్లకు నిధులు కేటాయించాలని సర్పంచ్ వినతిపత్రమివ్వగా దానికి పక్కన పెట్టడం సరి కాదని, పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధి పనిచేయాలని, మంత్రి పదవి ఆశతో గ్రామాల అభివృద్ధి పక్కన పెట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా గత ప్రభుత్వాన్ని విమర్శించడం కాకుండా నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించి, నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి సూచించారు.



## ప్రతిరోజు యోగ ఆరోగ్యానికి మేలు చేస్తుంది..!

- కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాధిక...
- ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

**ఇబ్రహీంపట్నం జూన్ 20 మహా**:జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ మరియు వ్యాయామ విద్య విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాధిక మాట్లాడుతూ... ప్రతిరోజు యోగా చేయడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు దరిచేరకుండా ఉంటాయన్నారు. యోగ ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవ పథక ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రమేష్, డాక్టర్ చింతల రాకేష్ భవాని, డాక్టర్ రచన మరియు వ్యాయామ విద్య అధ్యాపకులు డాక్టర్ నర్సింగ్ రావు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్, అధ్యాపకులు నరేందర్ రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ కరుణ, డాక్టర్ మాధవి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ శ్రీ కృష్ణ, డాక్టర్ సురేష్, ప్రసాద్, శ్రీశైలం అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణపై శిక్షణ

**రాజేంద్రనగర్, మహా:** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు), సూపర్‌వైజర్లకు శనివారం రాజేంద్రనగర్‌లోని టీజీఐఆర్డీ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జోనల్ కమిషనర్, ఈఆర్‌వో శ్రీనివాస్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రతి ఇంటికి, ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజమైన ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా బీఎల్‌వోలు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.ఎమ్మార్వో బొమ్మ రాములు, ఏఈఆర్‌వో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఫారాల పంపిణీ, వివరాల నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్, మాస్టర్ ట్రైనర్లు లాలయ్య, రవికాంత్ రెడ్డి పాల్గొన్నారు.



# నీట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**మహా వరంగల్ బ్యూరో:** జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ నిర్వహణ సందర్భంగా వరంగల్ లోని సీకేఎం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్. సత్య శారద శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి వెంట అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, వరంగల్ ఆర్డీవో సుమ, తహసిల్దార్ శ్రీకాంత్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ధర్మ రెడ్డిలు ఉన్నారు. పరీక్షా కేంద్రంలో అభ్యర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, పరీక్ష నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని, అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులకు అవసరమైన తాగునీరు, వైద్య సదుపాయాలు, విద్యుత్ సరఫరా వంటి ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరీక్ష పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రంలో మొత్తం 480 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, వారి కోసం 20 పరీక్షా గదులను ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వహణకు 40 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అన్ని గదుల్లో జామర్లు ఏర్పాటు చేయడంతో పాటు, 35 సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపట్టారు. అభ్యర్థులకు ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రంలోకి ప్రవేశానికి అనుమతి కలదని, మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్షా నిర్వహించడం జరుగుతుందని, దివ్యంగులకు 6.16 వరకు పరీక్షా నిర్వహించడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్, పరీక్ష నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పరీక్ష సజావుగా నిర్వహించ బడేందుకు తీసుకున్న ఏర్పాట్లపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు.



## ట్రాఫిక్ నిబంధనల అమలుపై పోలీసుల ప్రత్యేక డ్రైవ్

- **ప్రాణాల భద్రతే ట్రాఫిక్ పోలీసుల ప్రధాన కర్తవ్యం...**
- **ట్రాఫిక్ సిఐ సిహెచ్ రాజు..**

**రాజేంద్రనగర్ మహా;** రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎగ్జిట్ 17 వద్ద ట్రాఫిక్ సిఐ సిహెచ్ రాజు ఆధ్వర్యంలో వాహనాల ప్రత్యేక డ్రైవ్ ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ సీహెచ్ రాజు మాట్లాడుతూ ప్రజల ప్రాణాల భద్రతే ట్రాఫిక్ పోలీసుల ప్రధాన కర్తవ్యం అన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి, అవసరమైన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలి. అనుమతి లేని సైరన్లు, బ్లాక్ ఫిల్మ్, హై బీమ్ లైట్ల వినియోగాన్ని పూర్తిగా నివారించాలి. గూడ్స్ వాహనాలలో ఓవర్‌లోడింగ్ చేయకూడదు. పాఠశాల బస్సుల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇలాంటి ప్రత్యేక తనిఖీలు భవిష్యత్తులో కూడా నిరంతరం కొనసాగుతాయి అని తెలిపారు.



## పాలకుర్తిలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

**పాలకుర్తి జూన్ 20** పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ ఈ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిలకాని రాజేశం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, ఈ సందర్భంగా లబ్ధిదారులు దారవేణి రాజుశైలజ దంపతులు మాట్లాడుతూ, తమకు సొంతిల్లు కల సాకారం కావడంలో సహకరించిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ మరియు MLA సతీమణి మనాలి ఠాగూర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో మందికి ఆసరాగా నిలుస్తోందని వారు పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బ్రహ్మం RMP, దారవేణి సంజీవ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ సాయంపై రైతులకు అవగాహన కల్పించిన వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు

**పాలకుర్తి, జూన్ 20 పెద్దపల్లి** జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలోని దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి 23వ విడత నిధుల విడుదల కార్యక్రమం శనివారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా పాలకుర్తి మండల రైతు వేదికలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి బత్తిని శ్రీనివాస్, కేవీకే రామగిరి హెడ్ డాక్టర్ వెంకట రమేష్‌లతో కలిసి రైతులు తిలకించారు.ఈ విడతలో భాగంగా పాలకుర్తి మండలంలోని 3,724 మంది అర్హులైన రైతుల కుటుంబాలకు తలా రూ. 2,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి.కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతుల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ పథకానికి సంబంధించి లబ్ధిదారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ముఖ్యంగా ఈకేవైసీ




(eKYC), భూమి రికార్డుల వివరాలు, మరియు నిధులు రాని రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అధికారులు వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి DAO బత్తిని శ్రీనివాస్, కేవీకే హెడ్ డాక్టర్ వెంకట రమేష్, రామగిరి శాస్త్రవేత్తలు డాక్టర్ పి. కిరణ్, డాక్టర్ వై. వెంకన్న, డాక్టర్ టి. వినోద్, మండల వ్యవసాయ అధికారి MAO బండి ప్రమోద్ కుమార్, ఏఈఓలు ఎం. సువర్ణరేఖ, కె. శ్రీకాంత్, జే. సుష్మ మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రెవిన్యూ ,అటవీశాఖ ల జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి

- **ఆఖినేపల్లి, లింగాలపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్.**



**దమ్మపేట ,మహా :**మండల పరిదిలోని ఆఖినేపల్లి, లింగాలపల్లి పంచాయతీ లలో భద్రాద్రి జిల్లా కలక్టర్ అంకిత్ శనివారం సుడిగాలి పర్యటన చేశారు. అంతకుముందు ఆకస్మికంగా స్థానికంగా ఉన్న తహశీల్దార్ కార్యాలయంలో రికార్డుల ను క్షుణ్ణంగా పరిశీలించారు. నకిలీ సాదా బైనామాలను రద్దు చేయాలని,ఏజెన్సీ ప్రాంతంలో రైతుల పట్టాలను ఎట్టి పరిస్థితి లో రికార్డుల గోల్మాల్ చేయవద్దని తహశీల్దార్ ను హెచ్చరించారు. జిల్లాలో ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్‌క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అఖినేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్‌క్యాడస్ట్రల్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని కలక్టర్ సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం లింగాలపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. అటవీ మరియు రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దుల నిర్ధారణలో ఖచ్చితత్వం పాటించాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తూ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ అక్కినేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళికా బద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తిచేయనున్నట్లు వివరించారు. తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఫారెస్ట్-రెవెన్యూ జాయింట్ సర్వే ద్వారా అటవీ, రెవెన్యూ భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో పాటు భవిష్యత్తులో తలెత్తే వివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. సర్వే, భూసేకరణ ప్రక్రియలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, దమ్మపేట తాసిల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు,సర్వేయర్ నాగరాజు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు .

## డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

**చర్ల, మహా:** గిరిజన ఉపాధ్యాయుడు పలక నాగేశ్వరావుపై అనుచితంగా ప్రవర్తించి, దాడి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న చర్ల ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ కృష్ణ ప్రసాద్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆదివాసి సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది.జేఏసీ నాయకులు మాట్లాడుతూ, వైద్యం కోసం ఆసుపత్రికి వెళ్లిన ఉపాధ్యాయుడిని డాక్టర్ దూషించడమే కాకుండా శారీరకంగా దాడి చేశారని ఆరోపించారు. ప్రజలకు సేవ చేయాల్సిన వైద్యులు రోగులతో మర్యాదగా వ్యవహరించాల్సి ఉండగా, ఇలాంటి ఘటనలు ఖండనీయమని అన్నారు. డాక్టర్ కృష్ణ ప్రసాద్‌పై పూర్తి స్థాయి విచారణ జరిపి, విధుల నుంచి సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## చర్లలో కాంగ్రెస్‌కు చేరికల జోరు

**చర్ల, మహా:** చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని పార్టీ నాయకులు తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సొసైటీ చైర్మన్ కొప్పునూరి బాబురావు, సీతపతి రాజుతో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.
జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీకృష్ణ, మండల అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చేరిన వారికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని నాయకులు పేర్కొన్నారు.ఎమ్మెల్యే డా. తెల్లం వెంకట్రావు నాయకత్వంలో చర్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని వారు అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్ రెడ్డి

**బూర్గంపహాడ్, మహా:** పినపాక నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా యాదమకంటి (ఎడమకంటి) సుధాకర్ రెడ్డిని రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకత్వం నియమించింది. రాష్ట్ర ఇంచార్జి ఖలీల్ అహ్మద్, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ఆదేశాల మేరకు నియామక ఉత్తర్వులు జారీ కాగా, సుధాకర్ రెడ్డికి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సుధాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. యువజన కాంగ్రెస్‌ను గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను యువతలోకి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని రాష్ట్ర నాయకత్వం సూచించింది. నూతన బాధ్యతలపై స్పందించిన సుధాకర్ రెడ్డి, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. యువతను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించి క్రియాశీలకంగా పనిచేసేలా ప్రోత్సహిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మార్గదర్శకత్వంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకత్వం, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులకు సుధాకర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.





## దోసపాటికి ఘన సన్మానం

**మణుగూరు, మహా:** తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలో నిర్మించనున్న తెలంగాణ భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా ఎంపికైన ఎస్‌కేటీ గ్రూప్ చైర్మన్ దోసపాటి వెంకటేశ్వరరావును ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.
గుట్టమల్లారంలోని శ్రీ వెంకటేశ్వరాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ దోసపాటి వెంకటేశ్వరరావు సామాజిక, ఆధ్యాత్మిక సేవల్లో ఎప్పుడూ ముందుంటూ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారని కొనియాడారు. ఉచిత అంతిమ రథ యాత్ర సేవలు, దేవాలయాలకు విరాళాలు, ప్రజా సేవా కార్యక్రమాల ద్వారా విశేష సేవలందించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆశీర్వచనాలు అందించగా, పలువురు ప్రముఖులు పుష్పగుచ్ఛాలు, శాలువాలతో దోసపాటిని సత్కరించారు. ముఖులు, ఆర్య వైశ్య సంఘం మండల, పట్టణ నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కడవెండి విశ్వనాథ గుప్తా, దుగ్గి సతీష్, దోసపాటి నాగేశ్వరరావు, చిత్తలూరి రమేష్ బాబు, కత్తి రాము, బండారు నర్సింహారావు, చిట్టూరి శేషుకుమార్, బొగ్గవరపు మురహరి, మురళి, సంకా రాధాశ్యాం గుప్తా, సంకా శ్రీనివాసరావు, కందుకూరి సుబ్బారావు, బొడ్డు పుల్లారావు, వడియాల ప్రభాకరరావు, దింటకుర్తి బ్రహ్మయ్య, సుగ్గల భాను సంతోష్, సుగ్గల సూర్యం, కోటగిరి సందీప్, బచ్చు స్వరాజ్యరావు, వాసు, నరేందర్, కంకణాల వెంకటేశ్వరరావు, వాసవీ క్లబ్ అధ్యక్షుడు మిట్టపల్లి శ్యామ్, కొల్లూరి గౌరీశంకర్, శ్రీరామ్ రాము, డాక్టర్ సమ్మయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలకు కృషి చేయాలి

- **ఏరియా జీఎం ఎం.షాలేం రాజు**
- **సింగరేణి ఏరియా ఆధ్వర్యంలో యోగా దినోత్సవం**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**:కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఉద్యోగులందరికీ జీఎంఎం. షాలేం రాజు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి దిశానిర్దేశాలతో సంస్థ వ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు చేపట్టిన కార్యక్రమాలలో భాగంగా శనివారం కొత్తగూడెం సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని గనులు విభాగాలలో యోగా కార్యక్రమాలు నిర్వహించారు. రుద్రంపూర్ ఆర్‌సీఓఏ క్లబ్ ప్రాంగణంలో భారీ యోగా ప్రదర్శన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజు మాట్లాడుతూ యోగా సాధన ద్వారా శారీరక దృఢత్వం మానసిక ప్రశాంతత ఏకాగ్రత ఆత్మవిశ్వాసం పెంపొందడంతో పాటు జీవన నాణ్యత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. వృద్ధాప్యంలోనూ ఆరోగ్యవంతమైన చురుకైన జీవన విధానాన్ని కొనసాగించేందుకు యోగా ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఆరోగ్యపరమైన శ్రేయస్సు దృష్ట్యా నిర్వహిస్తున్న ఈ యోగా కార్యక్రమాలు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడానికి దోహదపడతాయని అన్నారు. యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించి శారీరక మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సంస్థ ఉద్యోగుల సంక్షేమం ఆరోగ్య పరిరక్షణకు ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.అలాగే ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని యోగా సాధనకు కేటాయించాలని సురక్షితమైన పని విధానాలను పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవనశైలితో ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఉద్యోగులందరికీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జీఎం ఎం.షాలేం రాజుతో పాటు ఎస్ఓ టు జీఎం ఎం.గోవిందరావు, ఏఐటీయూసీ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ రాములు, ఐఎన్‌టీయూసీ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, (సీఎంఓఏఐ) జనరల్ సెక్రటరీ ఉపేందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వరరావు, పర్సనల్ మేనేజర్ ఎల్.తిరుపతి, ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, ఎంవీటీసీ మేనేజర్ లక్ష్మణ్, వివిధ విభాగాల అధిపతులు ఉద్యోగులు కాంట్రాక్ట్ ఉద్యోగులు అప్రెంటిస్‌లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కుక్కలదాడిలో బాలికకు తీవ్రగాయాలు

- **బాలికను పరామర్శించిన బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు**
- **మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై గంట ధ్వజం**



**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ నగరంలో అనేక చోట్ల చిన్నారులపై వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి.గతంలో కూడా వీధి కుక్కల వల్ల చిన్న నుంచి పెద్దల వరకూ తీవ్ర గాయాల పాలయ్యారనే విషయం అందరికీ తెలిసిందే. అంతేకాకుండా బల్దియా నిర్లక్ష్యం వల్ల అభం శుభం తెలియని చిన్నారుల ప్రాణాలు పోయిన సంఘటనలు మరువక ముందే వరంగల్ నగరంలోని శాలినీనగర్ లో వీధి కుక్కల దాడిలో ఏడాదిన్నర బాలిక తీవ్రంగా గాయపడటం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం, మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం పై గంట రవికుమార్ మండిపడ్డారు. వరంగల్ మహా నగరంలో కుక్కలు, కోతులు స్వైరవిహారం చేస్తుంటే మున్సిపల్ కార్పొరేషన్ ఏం చేస్తోంది?.. వాటిని పట్టుకోవడానికి బల్దియా బడ్జెట్లో కేటాయించిన లక్షల నిధులు ఏమవు తున్నాయి.? ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ప్రజల ప్రాణాలనే గాలి కొదిలేస్తారా.? అంటూ బిజెపి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ధ్వజమెత్తారు. బాధిత కుటుంబానికి మెరుగైన వైద్యం, ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. వరంగల్ నగరంలోని లేబర్ కాలనీ శాలినీనగర్ లో వీధి కుక్కల దాడిలో ఏడాదిన్నర బాలిక తీవ్రంగా గాయపడటం పట్ల బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఎంజీఎం ఆసుపత్రికి చేరుకుని, చికిత్స పొందుతున్న బాలికను పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. బిహార్ రాష్ట్రానికి చెందిన వలస కూలీలు రీతు, అజయ్ దంపతులు బతుకుతెరువు కోసం ఇటీవల వరంగల్ నగరానికి వలస వచ్చారని, భవన నిర్మాణ పనుల్లో భాగంగా శాలినీనగర్ లో తల్లిదండ్రులు పని చేసుకుంటుండగా, ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారి పై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడం అత్యంత దారుణమన్నారు. ఈ దాడిలో బాలిక ముఖం, చేతుల పై తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత బాలిక పరిస్థితిని పరిశీలించిన అనంతరం గంట రవికుమార్ ఎంజీఎం ఇన్చార్జ్ సూపరింటెండెంట్, సంబంధిత ఈఎన్ టి వైద్యులతో మాట్లాడారు. బాలిక ఎటువంటి లోటు లేకుండా తక్షణమే అత్యుత్తమ, మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. నగరంలో వీధి కుక్కల నియంత్రించడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని గంట రవికుమార్ ధ్వజమెత్తారు. స్థానిక శాసనసభ్యురాలు, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు ప్రజల ప్రాణాల కంటే రాజకీయాల కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. నగరంలో వరుసగా కుక్కల దాడులు జరుగుతున్నా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మొద్దునిద్ర వీడి, నగర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కోతులు, కుక్కల దాడుల నుండి చిన్నారులను, నగర ప్రజలను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పోలేపాక మార్టిన్ లూథర్, బిజెపి జిల్లా నాయకులు నోముల రతన్, బొడ్డు రాకేష్, రాఘవ చారి, రానా యాదవ్ తో పాటు శాలిని నగర్ స్థానికులు పాల్గొన్నారు.

# చీకటి కమ్మిన 'జగ్గారం'

- పని చేయని హై
- మూడునాళ్ళ ముచ్చటేనంటున్న గిరిజనులు.
- హైమాస్ట్ అంతా ఆరంభ శూరత్వమేనా...?



**దమ్మపేట,మహా** : గిరిజన పల్లెల్లో వెలుగులు తెస్తామని చెప్పిన ప్రజాపాలన పాలకులు , నేడు జగ్గారం గ్రామాన్ని చీకట్లు కమ్మేసిన పట్టించుకునే నాధుడే లేడంటూ గిరిజనులు లబోదిబోమంటున్నారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటు ప్రక్రియ అంతా ఆరంభ శూరత్వమే తప్ప వాటిపై అధికారుల పర్యవేక్షణ లేదంటూ గిరిజన ప్రజలు మండిపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామాల్లో వెలుగులు నింపాలనే ఉన్నత లక్ష్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ (ఐమాస్) లైట్లు అధికారుల, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల నిరుపయోగంగా మారుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట దలం జగ్గారం పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు గత నెల రోజులుగా వెలగకపోవడంతో గ్రామాలు చీకటిమయంగా మారాయి.

**ఐదేళ్ల గ్యారెంటీ ఉన్నా పట్టించుకోని కాంట్రాక్టర్..**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఈ హైమాస్ట్ లైట్ల నిర్వహణను టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టరే చూసుకోవాల్సి ఉంటుంది. ఏర్పాటు చేసిన తేదీ నుండి 5 సంవత్సరాల పాటు ప్రతి లైట్ నిరంతరాయంగా వెలిగేలా చూసే బాధ్యత (మెయింటినెన్స్) సదరు కాంట్రాక్టర్లదే. కానీ, జగ్గారంలో లైట్లు పాడై నెల రోజులు గడుస్తున్నా అటు కాంట్రాక్టర్ గానీ, ఇటు పంచాయతీ సిబ్బంది గానీ కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. పర్యవేక్షణ పూర్తిగా లోపించడంతో రాత్రి వేళల్లో గ్రామంలో చిమ్మచీకట్లు అలుముకుంటున్నాయి. దీనివల్ల స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**మిగిలిన గ్రామాల్లోనూ ఏర్పాటు చేయాలి:** ప్రజల డిమాండ్

"జగ్గారం పంచాయతీ పరిధిలో మొత్తం 5 గ్రామాలు ఉండగా, కేవలం 3 గ్రామాల్లో మాత్రమే ఈ హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. మిగిలిన రెండు గ్రామాల్లో కూడా లైట్లను ఏర్పాటు చేసి తమకు చీకటి కష్టాలు తప్పించాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు."

**ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారా..?**

ప్రభుత్వ సొమ్ముతో ఏర్పాటు చేసిన లైట్లు వృధాగా మారుతుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, కాంట్రాక్టర్ తక్షణమే స్పందించి, వెలగని హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు చేయించి పునరుద్ధరించాలని, అలాగే మిగిలిన గ్రామాల్లో కూడా కొత్త లైట్లను ఏర్పాటు చేయాలని జగ్గారం పంచాయతీ ప్రజలు ,గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు.

# రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి

.బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్

**బెల్లంపల్లి, మహా**: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందుకు రాష్ట్రంలో మోసపూరిత వాగ్దానాలను చేసి విస్మరించిందని ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు బెల్లంపల్లి పట్టణంలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నాడు ప్రెస్ మీట్ నిర్వహించి రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ రాష్ట్ర రైతులకు అమలుకాని హామీలిచ్చి మోసపూరిత మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఇచ్చిన గ్యారెంటీలు, హామీలను విస్మరించిందని తెలిపారు.6 గ్యారెంటీలు, 420 హామీలలో రైతులకు సంబంధించిన రైతుభరోసా, రైతుభీమా, రైతు రుణమాఫీ, బోనస్ లాంటి గ్యారెంటీలు, హామీలను ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 100 రోజుల్లోనే పూర్తిస్థాయిలో అమలు చేస్తామని బోగస్ మాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కి సుమారు 30 నెలలు గడిచినా నేటికి ఒక్క గ్యారెంటీ, హామీను కూడా పూర్తిచేయలేదని విమర్శించారు.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు సరిపోయే విధంగా సాగునీరు, నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేదని, ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ఆ పరిస్థితులు లేవని తెలిపారు.



కనీసం రైతుల నుండి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయలేని, రైతులకు సరైన సమయంలో యూరియా కూడా సరఫరా చేయలేని పరిస్థితుల్లో కూడా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం లేదని తెలిపారు. ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రశ్నిస్తున్న రైతులను అధికారబలంతో అణిచివేసి అక్రమ కేసులను బనాయించి రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా తమ తీరు మార్చుకుని రైతులకు ఇచ్చిన అన్ని గ్యారెంటీలను, హామీలను వెంటనే పూర్తిస్థాయిలో అమలుచేయడమే కాకుండా రైతులనుండి ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, అలాగే రైతులకు సరిపడా యూరియాను కూడా సరఫరా చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన తమ పార్టీ తరుపున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ దొంగల సత్యనారాయణ బెల్లంపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ తో పాటు పార్టీ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

# తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్రీజర్ ప్రారంభం

**బెల్లంపల్లి, మహ**:బెల్లంపల్లి పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఫ్రీజర్ తోపాటు వైకుంఠ రథం అందిస్తున్నామని బెల్లంపల్లి తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూచనిపోయిన వారి కుటుంబాలకు కొన్ని సందర్భాల్లో మృతుల కుటుంబీకులకు ఫ్రీజర్ అందించాలనే సదుద్దేశంతో మరోక 2వ ఫ్రీజర్ శనివారం ఉదయం 8 గంటలకు పోచమ్మ గుడి రోడ్డు చెరువు వద్ద ప్రారంభించామని ఫ్రీజర్ దాత గైని మల్లేష్ తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నకు నూతన ఫ్రీజర్ అందివ్వడం శుభపరిణామం అన్నారు. ఫ్రీజర్ దాత గైని మల్లేష్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం మల్లేష్ ని తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఘనంగా శాలువా తో సన్మానించారు. కార్యక్రమం లో పాల్గొన్న తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రంగ రామన్న, ప్రధాన కార్యదర్శి కంటెవాడ నాగేష్ కుమార్, కోశాధికారి కజ్జం రమేష్, బెల్లంపల్లి బస్సు వార్డు మెంబర్ సిమ్రాన్ ఖలీమ్, సభ్యులు రత్నం రాజన్న, గెల్లీ జయరాం యాదవ్, గంట శ్రీనివాస్,రత్నం ఐలయ్య, బాల నాందేవ్ రమేష్, భీమిని కనకయ్యగౌడ్, కోయాడ శంకర్ గౌడ్, ఏనుగు నరేష్, పాంచాలపు శ్రీనివాస్, కందుల సత్తయ్య, తిప్పా శ్రీనివాస్, నరసయ్య, మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.



# విజిబుల్ పోలీసింగ్‌తోనే నేరాల నియంత్రణ

**మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్**

మందమర్రి, మహా : విజిబుల్ పోలీసింగ్‌తోనే నేరాల నియంత్రణ సాధ్యమని మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ అన్నారు. శనివారం ఆయన మందమర్రి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ీసీపీ మాట్లాడుతూ స్టేషన్ ఆవరణ ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రిసెప్షన్ సెంటర్ రికార్డులను తనిఖీ చేశారు. నమోదవుతున్న కేసుల వివరాలు, రౌడీషీటర్ల వివరాలు, నేరాల స్వభావం, కేసుల పురోగతి తదితర అంశాలను తెలుసుకున్నారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్ అత్యవసరమని, నిరంతర పెట్రోలింగ్‌తో పాటు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గంజాయి ,ఇతర మత్తు పదార్థాల క్రయవిక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధికి సంబంధించిన వివిధ అంశాలను సీఐ రమేష్ డీసీపీకి వివరించారు. ఈ తనిఖీలలో బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్, మందమర్రి ఎస్ఐ నరేష్ పాల్గొన్నారు.





# ముగిసిన అన్నాఅక్క శిక్షణ కార్యక్రమం

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**:రామచంద్ర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో కృత్రిమ మేధ(ఏఐ) డిజిటల్ లెర్నింగ్‌పై నిర్వహించిన రెండు రోజుల అన్నాఅక్క శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.పద్మ శనివారం తెలిపారు. ఈ రెండు రోజుల శిక్షణలో భాగంగా స్థానిక డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులకు అనుబోస్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.అవని మాస్టర్ ట్రైనర్‌గా హాజరై ఏఐ, డిజిటల్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించినట్లుగా చెప్పారు. వాస్తవ జీవిత సమస్యల పరిష్కారంలో ఏఐ డిజిటల్ అభ్యాసం ఉపయోగాలు మెషిన్ లెర్నింగ్ మోడల్ పనితీరు విధానం ఏఐ డీఎల్ ఎంఎల్ డీఎస్‌ల మధ్య తేడాలు, సి, సి ప్లస్ ప్లస్,జావా ప్రాథమిక అంశాలను వివరించినట్లుగా తెలిపారు. అలాగే కోడింగ్ అంటే ఏమిటి సురక్షిత ఇంటర్నెట్ కనెక్షన్ పబ్లిక్ వైఫై ప్రమాదాలు గోప్యత డిజిటల్ ముద్ర పాస్‌వర్డ్ ఖాతా భద్రత నకిలీ వెబ్‌సైట్లు స్పామ్ లింకులపై అవగాహన సైబర్ భద్రత సురక్షిత ఆన్‌లైన్ గేమింగ్ విద్యార్థుల నైతికత హక్కులు బాధ్యతలు తదితర అంశాలపై వివరించినట్లుగా పేర్కొన్నారు.డిగ్రీ పూర్తి చేసిన తరువాత విద్యార్థులు సెల్‌ఫోన్ల ద్వారా ప్రతి నెల ఆదాయం పొందే వివిధ విధానాలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనుబోస్ కళాశాల కంప్యూటర్ సైన్స్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఎన్. సుష్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కె. సౌమ్య, వి.కళ్యాణి శిక్షణ ఇచ్చినట్లుగా వివరించారు. ఎండి.ఫిరోజ్ సాంకేతిక సహాయాన్ని అందించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల నోడల్ అధికారులైన గణిత విభాగాధిపతి పి.అనురాధ, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ ఎ.వెంకటేశ్వర్లు, ఫిజిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఎన్.అనిత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.పూర్ణచంద్రరావు, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ కె.వనజ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జి.మధు, డాక్టర్. సునీత, డాక్టర్ ఎన్.విద్యా ప్రవీణ, అంజని, అరుణ, వెంకట రమణ, లక్ష్మీనారాయణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివజ్యోతి, చక్రవర్తి, దిలావర్, సైదులు, కార్తీక్ తదితరులు పాల్గొన్నట్లుగా పేర్కొన్నారు.



# బిజెపిని మరింత బలోపేతం చేయాలి

- బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**:వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని ఇందులో ఎలాంటి సందేహం లేదని బిజెపి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఇప్పటి నుంచే ప్రతి కార్యకర్త కృషి చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు.

భద్రాద్రి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీని తెలంగాణలో మరింత బలోపేతం చేయాలని అన్నారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విస్మరిస్తుందని అన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని బలహీనపరిచిందని రైతులకు రైతు భరోసా ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. అదేవిధంగా ధాన్యం మొక్కజొన్న కొనుగోలులో పూర్తిగా విఫలమైందని అన్నారు. గతంలో కెసిఆర్ ప్రభుత్వము ఎలాగైతే ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేసిందో ఇప్పుడు రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అలాగే చేస్తూ ప్రజలని మోసం చేస్తుందని అన్నారు. అధికారంలోకి వస్తే జాబు కాలండర్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు కానీ నేటికీ అది అమలు కావడం లేదని దీనివల్ల యువత పెద్ద ఎత్తున నిరుద్యోగ సమస్య ఎదుర్కొంటూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి కరణం సాయి పరిణితి మాట్లాడుతూ ప్రతి బిజెపి కార్యకర్త తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచాలని అదేవిధంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపులో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ జిల్లా అధ్యక్షులు కె.వి.రంగా కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మా, పొడియం బాలరాజు, కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి పుణ్యం బిక్షపతి, డాక్టర్ వెంకన్న, భోగి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు భూక్య దివ్యశ్రీ, ఎస్ ఐ ఆర్ జిల్లా కన్వీనర్ మోహన్ కృష్ణ, జిల్లా ఆఫీస్ సెక్రటరీ కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- సీఎం సహకారంతో నియోజకవర్గం అభివృద్ధి
- ఇళ్ళు లేని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్ళు
- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:పేదల సొంతింటి కలను నేరవేర్చేందుకే రాష్ట్ర



ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిందని, ఇల్లు లేని ప్రతి పేద వారికీ ఇల్లు ఇస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో విస్లావత్ తులసి భీంజీ నాయక్ దంపతులు నిర్మించుకున్న, ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ ప్రారంభోత్సవం సందర్భంగా టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, స్థానిక సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్ ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో, ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇండ్లు లేని అర్హులైన ప్రతి పేద వారికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లను మంజూరు చేస్తుందని, రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా రంజక పాలనను ప్రజలు స్వాగతించారని, ఇందిరమ్మ రాజ్యం తెచ్చిన ఘనత ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఎప్పుడు చేయని విధంగా కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో విద్య, వైద్యం వ్యవసాయం, రోడ్లు అన్ని అభివృద్ధి కార్యక్రమాలు వందల కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఇప్పటికి 3500 ఇండ్ల నిర్మాణం చివరి దశకు వచ్చాయని, ఈ రెండవ దశలో నియోజకవర్గానికి మరో 2500 ఇండ్లు ఈ నెలాఖరుకు మంజూరు చేస్తామని తెలిపారు. ఇల్లు లేని ప్రతి పేదవారికి ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిచ్య నాయక్, ఉప సర్పంచ్ హీరాసింగ్ నాయక్, పిఎసిఎస్ డైరెక్టర్ వెంకటేష్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ప్రథమ శ్రేణి కోర్టులో..

- జాతీయ లోక్ అదాలత్ విజయవంతం
- పలు కేసులు రాజీ..
- నేరం అంగీకరించిన కేసుల్లో జరిమానాలు..




**మణుగూరు, మహా** : జాతీయ స్థాయిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో భారీ స్థాయిలో పెండింగ్ కేసుల పరిష్కారం జరిగింది. వివిధ రకాల కేసుల్లో రాజీ, నేర అంగీకారం, జరిమానాల ద్వారా గణనీయ సంఖ్యలో కేసులు పరిష్కారమై, కక్షిదారులకు సమయం, ధన వ్యయం తగ్గడంతో పాటు న్యాయస్థానాలపై ఉన్న భారం కూడా తగ్గిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కంబపు సూరి రెడ్డి మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా కేసులను పరస్పర రాజీతో త్వరిత గతిన పరిష్కరించుకోవచ్చు. దీనివల్ల కక్షిదారులకు న్యాయస్థానాల చుట్టూ తిరిగే అవసరం తగ్గుతుంది. సమయం, ఆర్థిక భారం రెండూ తగ్గడమే కాకుండా, దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సఖ్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు.

**- పలు కేసుల్లో రాజీ..**

మణుగూరు న్యాయస్థానం పరిధిలో పోలీసు, చెక్కు బాకీ, భరణం, గృహ హింస, మద్యం నిషేధ శాఖలకు సంబంధించిన మొత్తం 2,199 కేసులు పెండింగ్‌లో ఉండగా, జాతీయ లోక్ అదాలత్ ద్వారా 147 కేసులు పరిష్కారమయ్యాయి. వాటిలో 94 పోలీసు కేసులు, 2 చెక్ బౌన్స్ కేసులు పరిష్కారం కాగా, అందులో 42 పోలీసు కేసులు పరస్పర రాజీ ద్వారా ముగిశాయి. మిగిలిన 52 కేసుల్లో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో న్యాయస్థానం మొత్తం రూ. 1,15,000 జరిమానా విధించి కేసులను కొట్టివేసింది. మిగతా రెండు షేక్ బౌన్స్ కేసులు ఇరుపక్షాలు రాజీ కుదుర్చుకున్నారు. అలాగే పెట్టి కేసులు 385 పరిష్కారమై రూ.2,16,000 జరిమానా వసూలు చేయగా, ఈపెట్టి కేసులు 213 పరిష్కారమై రూ.24,700 జరిమానా విధించారు. ఇక బ్యాంకుల ముందస్తు వివాద పరిష్కారానికి సంబంధించిన 55 కేసులు పరిష్కారమవగా, సంబంధిత బాకీదారులు మొత్తం రూ.30,27,800 చెల్లించడంతో కేసులు ముగిశాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ మధు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాదులు సంధ్య, నాగార్జున్ రెడ్డి, సర్వేశ్వరరావు, రాము, న్యాయస్థాన సిబ్బంది, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత కక్షిదారులు పాల్గొన్నారు.

# నిరుపేద పిల్లల భవిష్యత్తును అడ్డుకోవద్దు.!

- రాజకీయ స్వార్థం కోసం విద్యా వ్యవస్థను నాశనం చేయవద్దు
- ఆరుట్ల (టిపిఎస్) స్కూల్ కమిటీ సభ్యుల ఆవేదన

**ఇబ్రహీంపట్నం జూన్ 20 మహా**:రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ పై బీఆర్ఎస్ ఆరోపణలను, ఆరుట్ల టిపిఎస్ స్కూల్ కమిటీ సభ్యులు ఖండించారు. గత ప్రభుత్వం హయాంలో కట్టిన భవనాలకే తుదిమెరుగులు దిద్దారన్న విమర్శలలో ఎలాంటి నిజం లేదని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు. పాఠశాల అభివృద్ధికి అందిన రూ. 10.91 కోట్ల నిధుల వివరాలు, విద్యా కమిటీ ఎస్‌డిఎఫ్ సంస్థ నుండి రూ. 3 కోట్లు, ప్రభుత్వం ద్వారా రూ. 5.31 కోట్లు అందినట్లు వెల్లడించారు. పిఎం శ్రీ పథకం ద్వారా రూ. 34 లక్షలు, వివిధ శాఖల ద్వారా రూ.18 లక్షల నిధులు మంజూరు కాగా ఇంకా పనులు పెండింగ్‌లో ఉన్నందున మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ. 12 కోట్లు దాటే అవకాశం ఉందని కమిటీ సభ్యులు బహిరంగపరిచారు. గతంలో అడ్మిషన్లపై ఆసక్తి చూపని గ్రామస్థులు.. ఇప్పుడు ముఖ్యమంత్రిచే ప్రారంభించాక అడ్మిషన్ల తాకిడి భారీగా పెరిగిందని వారన్నారు. నిధుల లెక్కలపై అవగాహన లేకుండా ఉపాధ్యాయుల, అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా అసత్య ప్రచారాలు చేయవద్దని విజ్ఞప్తి చేశారు. నిరుపేద పిల్లల భవిష్యత్తుతో ఆడుకోవద్దని, చేతనైతే స్కూల్ అభివృద్ధికి సహకరించాలని విమర్శకులను కోరారు.

# గంగారం రామకృష్ణ ట్రేడర్స్ పేరుతో రెండు కోట్లకు టోకరా..

- ముల్లంగి సాంబశివ రావు స్థానికుల అప్పు డబ్బులకు ఐ.పి తో ఎగనామానికి యత్నం.
- స్థానిక సివిల్ జడ్జ్, శాసన సభ్యురాలికి బాధితుల మెమోరాండం.

**సత్తుపల్లి, జూన్ 2**: మహా : అవసరానికి తీసుకున్న అప్పు మంచిది, అలవాటుగా తీసుకున్న అప్పు ఎప్పటికైనా ముప్పే.. అనే విధంగా మండల పరిధిలోని బి.గంగారం గ్రామంలో రామకృష్ణ ట్రేడర్స్ పేరుతో ఎరువుల దుకాణాన్ని నిర్వహించే ముల్లంగి సాంబశివరావు తీరు ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికంగా ఎరువుల వ్యాపారం చేస్తూ నమ్మకత్వాన్ని వెలగబోసి తనకు అవసరమైన ప్రతిసారి ప్రాంసరీ నోట్లు, చెక్కులు హామీగా చూపించి స్థానికుల దగ్గర అడ్డగోలుగా అప్పులు చేసి అడిగితే మొఖం సాటిస్తున్నాడని సాంబశివరావుకు రుణం అప్పుగా ఇచ్చిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో ఒకరికి తెలియకుండా మరొకరి దగ్గర సుమారు రెండు కోట్లకు పైగా రుణాన్ని అప్పుగా తీసుకొని అప్పు తీర్చమని అడిగిన బాధితులపై కోర్టులో ఐ.పి దాఖలు చేశాను మీకు నచ్చింది చేసుకోమని బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపారు. కష్టపడి కూడబెట్టిన సొమ్ము అప్పుగా ఇచ్చి మోసపోయామని సివిల్ కోర్టులో ఐ.పి దాఖలు పత్రాలలో పొందుపరిచిన సాంబశివరావు స్థిరాస్తులను సైతం దొంగసాటుగా అమ్మకానికి పెడుతున్నాడని ఈ విషయంపై తగిన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని స్థానిక శాసన సభ్యురాలు మట్టా రాగమయి దయానంద్, సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మోరంపూడి ఇందిరా, గువ్వల పద్మా రెడ్డి, తేజావత్ నాగేశ్వరరావు, వంకదారు వాసుదేవరావు, ఉప్పె నరేష్, ఓరుగంటి వెంకటేశ్వరరావు, ఎస్.కె నాగుల్ మీరా, పొదిలి జయమ్మ, కొలగట్ల చెన్నారావు, సాంబ శివరావు, మానికల రాంబాబు, ఎస్.కె బాబా, కాశీం, డాక్టర్ జనార్ధన్, వంకదారు గోపాలరావు పలువురు బాధితులు ఉన్నారు.



# ప్రతి ధాన్యపు గింజ కొనాలి: బీఆర్ఎస్

**మణుగూరు, మహా:** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని, లేకపోతే తీవ్ర ఆందోళనలు తప్పవని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. మణుగూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్ మాట్లాడారు.ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని వారు విమర్శించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లలో తూకం, రవాణా, మిల్లర్ల వ్యవహారాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. రైతుబంధు సహా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక విధానాలను ప్రభుత్వం కొనసాగిస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

# ఈపీఎఫ్ సభ్యులకు త్వరలో డబుల్ ధమాకా!




దేశంలోని 7 కోట్లకు పైగా ఈపీఎఫ్ (ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్) సభ్యులకు త్వరలో రెండు కీలక ప్రయోజనాలు అందుబాటులోకి రానున్నాయి. ఒకటి 202526 ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ జమ, రెండోది ఈపీఎఫ్ సభ్యులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న ఏటీఎం, యూపీఐ ద్వారా పీఎఫ్ విత్‌డ్రా సదుపాయం.

### 8.25 శాతం వడ్డీ

202526 ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్ డిపాజిట్లపై 8.25 శాతం వడ్డీ రేటును కొనసాగించాలని ఈపీఎఫ్ఓ (EPFO) సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ సిఫారసు చేయగా, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం అనంతరం ఈ నెలాఖరులోగా సభ్యుల ఖాతాల్లో వడ్డీ జమయ్యే అవకాశముందని సమాచారం. దీంతో వరుసగా మూడో ఏడాది కూడా సభ్యులకు 8.25 శాతం వడ్డీ లభించనుంది.

### ఈపీఎఫ్ ఏటీఎం/యూపీఐ విత్‌డ్రా

ఇదే సమయంలో ఈపీఎఫ్ఓ తన సేవలను పూర్తిగా డిజిటల్ దిశగా మార్చే 'ఈపీఎఫ్ఓ 3.0' కార్యక్రమాన్ని వేగవంతం చేస్తోంది. ఈ కొత్త వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత సభ్యులు పేపర్‌లెస్ విధానంలో పీఎఫ్ క్లెయిమ్‌లు దాఖలు చేయడం, ఖాతాల బదిలీలు చేయడం, అలాగే అర్హత ఉన్న మొత్తాన్ని యూపీఐ లేదా యూపీఐసపోర్టెడ్ ఏటీఎంల ద్వారా నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేసుకునే అవకాశం పొందనున్నారు. ఈ సదుపాయం కోసం అవసరమైన సాంకేతిక పరీక్షలు పూర్తయ్యాయని కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్సుఖ్ మాండవియా ఇటీవల వెల్లడించారు. అయితే దేశవ్యాప్తంగా ఈ సేవలు ప్రారంభించే ఖచ్చితమైన తేదీని ఇంకా ప్రకటించలేదు. ప్రతిపాదిత విధానాల ప్రకారం సభ్యుల పీఎఫ్ నిధుల్లో కొంత భాగాన్ని రిటైర్మెంట్ భద్రత కోసం కొనసాగిస్తూ, అర్హత ఉన్న మొత్తంలో 50 నుంచి 75 శాతం వరకు యూపీఐ లేదా ఏటీఎం ద్వారా ఉపసంహరించుకునే అవకాశం కల్పించే దిశగా ఈపీఎఫ్ఓ పనిచేస్తోంది. అయితే ఈ నిబంధనలు ఇంకా పూర్తిస్థాయిలో అమల్లోకి రాలేదని, అధికారిక మార్గదర్శకాలు వెలువడిన తర్వాతే తుది వివరాలు స్పష్టమవుతాయని అధికారులు చెబుతున్నారు. ఇక సభ్యుల సౌకర్యార్థం ఆటోసెటిల్‌మెంట్ క్లెయిమ్ పరిమితిని ఇప్పటికే రూ.5 లక్షలకు పెంచిన ఈపీఎఫ్ఓ, వైద్యం, విద్య, గృహ నిర్మాణం, వివాహం వంటి అవసరాలకు సంబంధించిన క్లెయిమ్‌లను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించే చర్యలు చేపట్టింది. భవిష్యత్తులో ఉమాంగ్ యాప్‌లో ఫేస్ ఆథెంటికేషన్, వాట్సాప్ ఆధారిత సేవలు, తక్షణ పాస్‌బుక్ యాక్సెస్, ఆన్‌లైన్ వివరాల సవరణ వంటి సదుపాయాలు కూడా మరింత విస్తృతంగా అందుబాటులోకి రానున్నాయి.

# ప్రపంచ స్టీల్ డిమాండ్‌ను శాసించేది భారత్

## రానున్న దశాబ్దాల్లో గ్లోబల్ మార్కెట్‌కు మన దేశమే ప్రధాన వృద్ధి ఇంజిన్

### గడిచిన 20 ఏళ్లు చైనాది.. ఇకపై రాబోయే కాలం భారత్‌దే!.. 'గ్లోబల్ స్టీల్ డైనమిక్స్ ఫోరమ్ 2026' సదస్సులో లక్ష్మీ మిట్టల్ వెల్లడి

**న్యూఢిల్లీ:** భారత్‌లో స్టీల్ వినియోగం రానున్న దశాబ్దాల్లో భారీగా పెరగనుందని ఆర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ తెలిపారు. దేశవ్యాప్తంగా సాగుతున్న భారీ మౌలిక వసతుల విస్తరణ, వేగవంతమైన పట్టణీకరణ, గృహ నిర్మాణ రంగ వృద్ధి, హరిత ఇంధన ప్రాజెక్టులకు సంబంధించిన పెట్టుబడులు స్టీల్‌కు బలమైన డిమాండ్‌ను సృష్టిస్తాయని పేర్కొన్నారు. తద్వారా ప్రపంచ స్టీల్ డిమాండ్ పెరుగుదలకు భారత్ కీలక మార్కెట్‌గా, ప్రధాన వృద్ధి ఇంజిన్‌గా అవతరించనుందని అభిప్రాయపడ్డారు. న్యూయార్క్‌లో జరిగిన 'గ్లోబల్ స్టీల్ డైనమిక్స్ ఫోరమ్ 2026' సదస్సులో వీడియో సందేశం ద్వారా మిట్టల్ మాట్లాడారు.

### ఇకపై భారత్ వంతు..

వచ్చే జూలై 31 నాటికి ఆర్సెల్లార్ మిట్టల్ సంస్థ ఏర్పడి 20 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా లక్ష్మీ మిట్టల్ గతాన్ని గుర్తు చేసుకున్నారు. "చైనా అసాధారణ వృద్ధికి గడిచిన 20 ఏళ్లు సాక్ష్యంగా నిలిచాయి. ఇప్పుడు భారత్ వంతు వచ్చింది. దేశంలో భారీ ఎత్తున మౌలిక వసతుల విస్తరణ, పట్టణ గృహ నిర్మాణ రంగంలో వృద్ధి, ఇంధన పరివర్తనకు అవసరమైన ప్రాజెక్టుల కల్పన తదితర అంశాలు ఉక్కు రంగంలో భారత్‌ను ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తాయి" అని మిట్టల్ పేర్కొన్నారు.



### విలీనంతో సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొన్నాం

2006లో మిట్టల్ స్టీల్, ఆర్సెలర్ సంస్థల విలీనంతో ప్రపంచంలోనే అతిపెద్ద ఉక్కు తయారీ సంస్థగా ఆర్సెలర్‌మిట్టల్ ఆవిర్భవించిందని లక్ష్మీ మిట్టల్ తెలిపారు. ఈ విలీనం సంస్థకు పరిమాణం (స్కేల్), వ్యాపార వైవిధ్యం, స్థిరత్వం, వ్యూహాత్మక విస్తరణ పరంగా గణనీయ బలాన్ని చేకూర్చిందన్నారు. "20 ఏళ్ల ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసినప్పుడు, ఈ విలీనం మరింత బలమైన సంస్థను నిర్మించిందనే నమ్మకం ఉంది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం, కోవిడ్-19 మహమ్మారి వంటి ఊహించని 'బ్లాక్ స్వాన్' పరిణామాల ప్రభావాలు ఇప్పటికీ కనిపిస్తున్నప్పటికీ, ఈ సవాళ్లను విలీన సంస్థగా మరింత సమర్థంగా ఎదుర్కోగలిగాం. భారీ వ్యాపార పరిమాణం, విభిన్న మార్కెట్లలో ఉనికి, సంక్షోభాలను తట్టుకునే సామర్థ్యం మాకు బలంగా నిలిచాయి" అని మిట్టల్ వ్యాఖ్యానించారు.

### టెక్నాలజీతో మారుతున్న రంగం..

రెండు దశాబ్దాల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం స్టీల్ పరిశ్రమ పూర్తిగా గ్లోబలైజ్ అయిందని, సాంకేతికత, డేటా ఆధారితంగా రూపాంతరం చెందిందని మిట్టల్ అభిప్రాయపడ్డారు. ఉక్కు మార్కెట్లను రూపొందించడంలో ఆయా దేశాల 'స్థానిక పారిశ్రామిక విధానాలు' కూడా ఇప్పుడు కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తుచేశారు. పర్యావరణ, నియంత్రణ సంస్థల ఒత్తిళ్లు పెరుగుతున్నప్పటికీ.. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో డిమాండ్, కార్బన్ ఉద్గారాల తగ్గింపు కోసం జరుగుతున్న పెట్టుబడుల వల్ల స్టీల్ రంగానికి దీర్ఘకాలంలో తిరుగుండదన్నారు. "స్టీల్ పరిశ్రమలో 50 ఏళ్ల ప్రయాణం తర్వాత కూడా నేను ఉండాలనుకునే రంగం ఇదే. భవిష్యత్తులోనూ అనూహ్య సవాళ్లు ఎదురైనా, ఈ రంగం దీర్ఘకాలిక ఫండమెంటల్స్ మాత్రం బలంగానే ఉన్నాయి" అని మిట్టల్ అన్నారు.

# ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఐపీవోకి ఓకే..

**న్యూఢిల్లీ:** దేశీయంగా అతి పెద్ద ఫండ్ హౌస్ అయిన ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ పబ్లిక్ ఇష్యూకి (ఐపీవో) మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం లభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ ఇష్యూ పరిమాణం సుమారు రూ. 13,000 కోట్లుగా ఉండొచ్చని, వచ్చే నెలలో ప్రారంభం కావొచ్చని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నాయి. మార్చి నెలలో కంపెనీ సమర్పించిన ముసాయిదా ప్రాస్పెక్టస్ ప్రకారం ప్రమోటర్లు 20.37 కోట్ల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ఉండదు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్యారిస్‌కి చెందిన ఆమండి మధ్య జాయింట్ వెంచర్‌గా 1987లో ఎస్‌బీఐ ఫండ్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ఏర్పాటైంది. ఇందులో ఎస్‌బీఐకి 61.98 శాతం, ఆమండికి 36.40 శాతం వాటాలు ఉన్నాయి. త్రైమాసిక సగటు ప్రాతిపదికన ఎస్‌బీఐ ఎంఎఫ్ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం దాదాపు రూ. 12.5 లక్షల కోట్లుగా ఉంటుంది. ఇప్పటికే ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, యూటీఐ ఏఎంసీ, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఏఎంసీ, శ్రీరామ్ ఏఎంసీ, నిప్పన్ లైఫ్ ఇండియా అసెట్ మేనేజ్‌మెంట్ మొదలైనవి మ్యూచువల్ ఫండ్ విభాగం నుంచి లిస్టయిన సంస్థల్లో ఉన్నాయి.




### లిస్టులో మరో 4 కంపెనీలు

మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మరో నాలుగు కంపెనీల ఐపీవోలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్, శ్రేణి షేర్స్, ఎస్ఆర్ఐటీ ఇండియా ఈ జాబితాలో ఉన్నాయి. ఫిబ్రవరి, మార్చి మధ్యలో ఈ కంపెనీలు ముసాయిదా పత్రాలను దాఖలు చేయగా, జూన్ 16-19 మధ్య సెబీ.. అబ్జర్వేషన్లు ఇచ్చింది. సెబీ పరిభాషలో వీటిని నియంత్రణ సంస్థ ఆమోదంగా పరిగణిస్తారు. ఏజీఎస్ హెల్త్, పీజీపీ గ్లాస్ మార్చి నెలలో తమ ముసాయిదా పత్రాలను గోప్యతా విధానంలో సెబీకి సమర్పించాయి. స్టాక్ బ్రోకింగ్ సంస్థ శ్రేణి షేర్స్ ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూలో 69 లక్షల షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ప్రస్తుత షేర్‌హోల్డర్లు 82 లక్షల వరకు షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద విక్రయించనున్నారు. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించిన నిధులను వర్కింగ్ క్యాపిటల్.. సాధారణ కార్పొరేట్ అవసరాలు, నిర్దిష్ట రుణాల చెల్లింపు మొదలైన వాటి కోసం కంపెనీ ఉపయోగించుకోనుంది. ఇక ఎస్ఆర్ఐటీ ఇండియా ఐపీవోలో భాగంగా మొత్తం 1.68 కోట్ల షేర్లను తాజా ఇష్యూ కింద కంపెనీ విక్రయించనుంది. ఐపీవో నిధులను ప్రస్తుత ఉత్పత్తుల ఆధునీకరణ, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, ఇతర సంస్థల కొనుగోళ్లు మొదలైన వాటి కోసం కంపెనీ వినియోగించనుంది.




# తొలి ఎలక్ట్రిక్ బైక్.. డెలివరీలు షురూ!



రాయల్ ఎన్‌ఫీల్డ్ కంపెనీ తన తొలి ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ ఫ్లయింగ్ ఫ్లీ C6 డెలివరీలు (బెంగళూరులో) ప్రారంభించింది. కేవలం వాహనాన్ని విక్రయించడం మాత్రమే కాకుండా, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు స్పెషల్ సపోర్ట్ నెట్‌వర్క్‌ను కూడా సంస్థ ఏర్పాటు చేసింది. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఇప్పటికే ఉన్న షోరూమ్‌లు, సర్వీస్ సెంటర్లలో షాప్‌ఇన్‌షాప్ విధానాన్ని అమలు చేసింది. దీని ద్వారా ప్రత్యేకంగా కొత్త షోరూమ్‌లను ఏర్పాటు చేయకుండా.. ఇప్పటికే ఉన్న డీలర్ నెట్‌వర్క్ ద్వారా ఫ్లయింగ్ ఫ్లీ బైకును విస్తరించనున్నారు. అంతే కాకుండా.. వినియోగదారులకు 24 గంటల రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సదుపాయం కూడా అందుబాటులో ఉంటుంది. ఇది ప్రయాణ సమయంలో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే సహాయం అందించేలా ఉంటుంది. ఫ్లయింగ్ ఫ్లీ C6 ధర రూ. 2.79 లక్షలు (ఎక్స్‌షోరూమ్). అయితే.. బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ (BaaS) స్కీమ్ ద్వారా ఈ మోటార్‌సైకిల్‌ను రూ. 1.99 లక్షలకు కొనుగోలు చేయవచ్చు. ఈ పథకంలో బ్యాటరీ ఖర్చును విడిగా చెల్లించాలి. దీని వల్ల ప్రారంభ పెట్టుబడి తగ్గి, మరింత మంది వినియోగదారులు ఎలక్ట్రిక్ వాహనాన్ని సులభంగా కొనుగోలు చేసే అవకాశం పొందుతారు. ఈ మోటార్‌సైకిల్‌లో 3.91 కిలోవాట్ సామర్థ్యం గల బ్యాటరీ ప్యాక్‌ను అమర్చారు. ఇది ఒక ఫుల్ ఛార్జితో 154 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ పేర్కొంది. ఇందులో ఉన్న పర్మనెంట్ మ్యాగ్నెట్ సింక్రోనస్ మోటార్ 15.4 కిలోవాట్ల పవర్, 60 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఈ బైక్ 0 నుంచి 60 కిమీ వేగాన్ని కేవలం 3.7 సెకన్లలో చేరుకోగలదు. దీని గరిష్ట వేగం గంటకు 115 కిలోమీటర్లు. ఫ్లయింగ్ ఫ్లీ C6 బరువు కేవలం 124 కిలోలు మాత్రమే ఉండటం వల్ల ఇది తేలికగా ఉంటుంది. అయితే 19 అంగుళాల పెద్ద చక్రాలు, సన్నని 90 సెక్షన్ టైర్లు నగర రహదారులపై సౌకర్యవంతమైన ప్రయాణానికి అనుకూలంగా ఉంటాయి. ఫీచర్ల విషయానికి వస్తే.. ఇందులో 3.5 అంగుళాల రౌండ్ కలర్ టీఎఫ్‌టీ డిస్‌ప్లే, అడ్జస్టబుల్ రీజెనరేటివ్ బ్రేకింగ్, ఐదు రైడింగ్ మోడ్‌లు, లీన్ సెన్సిటివ్ ట్రాక్షన్ కంట్రోల్, డ్యూయల్ చానల్ ఏబీఎస్ వంటి ఆధునిక సాంకేతిక సదుపాయాలు ఉన్నాయి. ఇవి రైడింగ్‌ను మరింత సురక్షితంగా, సౌకర్యవంతంగా మారుస్తాయి.

# సంపదకు అసలైన మార్గం.. కియోసాకి మూడు సూత్రాలు!

ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా అమ్ముడైన పుస్తకాల్లో ఒకటి 'రిచ్ డాడ్ పూర్ డాడ్'. దీని రచయిత రాబర్ట్ కియోసాకి తన ఆర్థిక ఆలోచనలతో ఎంతో మంది పెట్టుబడిదారులను ప్రభావితం చేశారు. ఆయన చెప్పిన కొన్ని విషయాలు సాధారణంగా ప్రజలు నమ్మే ఆర్థిక సూత్రాలకు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. ముఖ్యంగా ఆయన చెప్పిన మూడు వ్యాఖ్యలు చాలా వివాదాస్పదంగా మారాయి.

### మీ ఇల్లు ఒక ఆస్తి కాదు

సాధారణంగా చాలామంది తమ ఇంటిని జీవితంలో అత్యంత విలువైన ఆస్తిగా భావిస్తారు. కానీ కియోసాకి అభిప్రాయం ప్రకారం.. ఒక ఆస్తి అంటే మీ జేబులోకి డబ్బు తీసుకురావాలి. మీరు నివసిస్తున్న ఇంటి వల్ల ఆదాయం రాకపోగా, హౌస్ లోన్ EMIలు, పన్నులు, నిర్వహణ ఖర్చులు వంటి వ్యయాలు పెరుగుతాయి. అందువల్ల అది నిజమైన ఆస్తి కాదని ఆయన చెబుతారు. అయితే అద్దెకు ఇచ్చి ఆదాయం వచ్చే ఇల్లు లేదా కమర్షియల్ ప్రాపర్టీ మాత్రం ఆస్తిగా పరిగణించవచ్చని ఆయన అభిప్రాయం.

### పొదుపు చేసేవారు నష్టపోతారు

సాధారణంగా డబ్బు పొదుపు చేయడం మంచి అలవాటుగా భావిస్తారు. కానీ కియోసాకి దృష్టిలో కేవలం బ్యాంకులో డబ్బు నిల్వ ఉంచడం వల్ల ద్రవ్యోల్బణం కారణంగా దాని కొనుగోలు శక్తి క్రమంగా తగ్గిపోతుంది. ఉదాహరణకు.. ఈరోజు రూ.100తో కొనగలిగే వస్తువు కొన్నేళ్ల తర్వాత రూ.120 లేదా అంతకంటే ఎక్కువ కావచ్చు. అందువల్ల డబ్బును కేవలం సేవింగ్స్ ఖాతాలో ఉంచడం కంటే పెట్టుబడుల రూపంలో పెంచుకోవాలని ఆయన సూచిస్తారు.



### ధనవంతులు డబ్బు కోసం పని చేయరు

చాలామంది ఉద్యోగం చేసి జీతం సంపాదించడం ద్వారా ఆర్థిక భద్రత పొందాలని భావిస్తారు. అయితే.. కియోసాకి ప్రకారం ధనవంతులు తమ సమయాన్ని డబ్బుకు అమ్ముకోరు. వారు.. వ్యాపారాలు, పెట్టుబడులు, రియల్ ఎస్టేట్ లేదా ఇతర ఆదాయ వనరులను సృష్టించి డబ్బు తమ కోసం పనిచేసేలా చేస్తారు. అంటే, వారు ఒకసారి నిర్మించిన ఆస్తులు నిరంతరం ఆదాయం తెచ్చిపెడతాయి. అందుకే సంపన్నులు సంపాదన కోసం మాత్రమే పనిచేయకుండా, ఆదాయాన్ని సృష్టించే వ్యవస్థలను నిర్మించడంపై దృష్టి పెడతారని ఆయన వివరిస్తారు. నిజానికి రాబర్ట్ కియోసాకి అభిప్రాయాలు అందరూ అంగీకరించకపోయినా, డబ్బు, పెట్టుబడులు, సంపద గురించి కొత్త కోణంలో ఆలోచించేలా చేస్తాయి. కేవలం సంపాదించడం లేదా పొదుపు చేయడం కాకుండా, ఆదాయాన్ని సృష్టించే ఆస్తులను నిర్మించడం ద్వారా దీర్ఘకాలిక ఆర్థిక స్వాతంత్ర్యం సాధించవచ్చని ఆయన అభిప్రాయం.



# ఒక్క ఫ్లాట్ రూ .121 కోట్లు.. రికార్డ్ రియల్ డీల్!

భారత లగ్జరీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మరో కళ్లు చెదిరే ఖరీదైన డీల్ నమోదైంది. ప్రముఖ ఇన్వెస్టర్ మధుసూదన్ మురళీధర్ కేలా.. డీఎల్ఎఫ్ అత్యంత విలాసవంతమైన నివాస ప్రాజెక్ట్ 'ది దహ్లియాస్'లో ఒక అపార్ట్‌మెంట్‌ను రూ.120.71 కోట్లకు కొనుగోలు చేశారు. రియల్ ఎస్టేట్ డేటా సంస్థ సీఆర్ఈ మ్యాట్రిక్స్ పరిశీలించిన రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం.. ఈ ఒప్పందం ఏప్రిల్ 15, 2026న నమోదైంది. అపార్ట్‌మెంట్ విస్తీర్ణం 6,233 చదరపు అడుగులు కాగా, ఐదు కార్ పార్కింగ్ స్థలాలు కూడా ఉన్నాయి. హర్యానాలోని గురుగ్రామ్ గోల్ఫ్ కోర్స్ రోడ్‌లో ఉన్న సెక్టార్-54 ప్రాంతం దేశంలోనే అత్యంత ప్రీమియం నివాస కేంద్రాల్లో ఒకటిగా ఎదుగుతోంది. డీఎల్ఎఫ్ సిటీ ఫేజ్-5లో అభివృద్ధి చేస్తున్న 'ది దహ్లియాస్' ప్రాజెక్ట్ ఇప్పటికే దేశీయ కార్పొరేట్ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలు, అధిక సంపన్నుల దృష్టిని ఆకర్షిస్తోంది. చదరపు అడుగుకు దాదాపు రూ.1.9 లక్షలకుపైగా విలువతో జరిగిన ఈ డీల్ గురుగ్రామ్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కొత్త రికార్డుగా నిలిచింది. స్టాక్ మార్కెట్‌లో ప్రముఖ ఇన్వెస్టర్‌గా పేరుగాంచిన కేలా , ప్రస్తుతం పలు లిస్టెడ్ కంపెనీల్లో గణనీయమైన వాటాలు కలిగి ఉన్నారు. తాజా షేర్‌హోల్డింగ్ వివరాల ప్రకారం, ఆయన పెట్టుబడుల మార్కెట్ విలువ వేల కోట్ల రూపాయలకు చేరుకుంది. ఇప్పుడు ఆయన లగ్జరీ రియల్ ఎస్టేట్‌లో చేసిన భారీ పెట్టుబడి, సంపన్న వర్గాలు నివాస ఆస్తులను కేవలం విలాసానికి మాత్రమే కాకుండా దీర్ఘకాలిక సంపద సృష్టి సాధనంగా కూడా చూస్తున్నాయనే ధోరణిని మరోసారి స్పష్టం చేసింది. డీఎల్ఎఫ్ 2024 అక్టోబర్‌లో ప్రారంభించిన 17 ఎకరాల 'ది దహ్లియాస్' ప్రాజెక్ట్‌లో మొత్తం 420 అపార్ట్‌మెంట్లు, పెంట్‌హౌస్‌లు ఉన్నాయి. కంపెనీ తాజా వివరాల ప్రకారం, ఇప్పటివరకు ప్రాజెక్ట్‌లో దాదాపు 60 శాతం యూనిట్లు అమ్ముడయ్యాయి. మార్చి 2026 నాటికి ఈ ప్రాజెక్ట్ ద్వారా రూ.18,500 కోట్లకుపైగా అమ్మకాలు నమోదయ్యాయి. మొత్తం ప్రాజెక్ట్ ఆదాయ సామర్థ్యం రూ.40,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా. భారత్‌లో అల్ట్రాలగ్జరీ హౌసింగ్ విభాగం గత రెండేళ్లుగా వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా గురుగ్రామ్, ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో రూ.10 కోట్లకు పైబడిన గృహాల విక్రయాలు గణనీయంగా పెరిగాయి.

# జెనరేటివ్ ఏఐతో రియల్ ఎస్టేట్‌కి మహర్దశ



**న్యూఢిల్లీ:** జెనరేటివ్ ఏఐతో భారత రియల్ ఎస్టేట్ రంగానికి భారీ ప్రయోజనం చేకూరనుంది. ఈ సాంకేతికత రియల్ ఎస్టేట్ సంస్థల నిర్వహణ సామర్థ్యాన్ని మరింత పెంచుతుందని, తద్వారా రాబోయే ఏడేళ్లలో 14 నుంచి 17 బిలియన్ డాలర్ల వరకు (రూ. 1.33-1.61 లక్షల కోట్లు) అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని ఈవై పార్థెనాన్, క్రెడాయ్ సంయుక్త నివేదిక అంచనా వేసింది. జెనరేటివ్ ఏఐతో నిర్మాణ రంగం పనితీరు మెరుగుపడటమే కాకుండా, అమ్మకాల వేగం 30 - 50 శాతం వరకు పెరుగుతుందని స్పష్టం చేసింది.

### నివేదికలోని ముఖ్యాంశాలు..

జెనరేటివ్ ఏఐ వినియోగంతో ఇళ్ల అమ్మకాల వేగం పెరగడమే కాకుండా, కొత్త ప్రాజెక్టులను మార్కెట్లోకి ప్రవేశపెట్టే సమయం 30 శాతం వరకు తగ్గుతుంది. వచ్చే ఏడేళ్లలో రియల్ ఎస్టేట్ రంగం నమోదు చేసే మొత్తం స్థూల విలువ జోడింపులో జెనరేటివ్ ఏఐ రూపంలో 3-4 శాతంగా ఉంటుంది. భూమి కొనుగోలు నుంచి ప్రాజెక్ట్ ప్రారంభించే మధ్య కాలవ్యవధి 20-30 శాతం వరకు తగ్గుతుంది. అలాగే నిర్మాణ వ్యయం, కాలపరిమితిలోనూ 5 నుంచి 20 శాతం వరకు ఆదా అవుతుంది. ప్రస్తుత డేటా ఆధారంగా కొత్త ఐడియాలు, డిజైన్ల సృష్టిలో సాయపడుతుంది.

### రంగం ముఖచిత్రానే మార్చేస్తుంది..

రియల్ ఎస్టేట్ రంగంలో తదుపరి వృద్ధి కేవలం వ్యాపార విస్తరణ పైనే కాకుండా, ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సరైన నిర్ణయాలను వేగంగా తీసుకోవడం పైనే ఆధారపడి ఉంటుందని ఈ నివేదిక విడుదల సందర్భంగా క్రెడాయ్ అధ్యక్షుడు శేఖర్ జి పటేల్ చెప్పారు. "నిర్వహణ సామర్థ్యంతోపాటు ప్రణాళిక, డిజైన్, నిర్మాణం, విక్రయాలు, కస్టమర్లతో సంబంధాలు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా స్పందించంలోనూ జెనరేటివ్ ఏఐ కీలక పాత్ర పోషించనుంది" అని వివరించారు.



## ప్రతి తుఫాను వెనుక...

బాలకృష్ణ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో రూపొందుతున్న తాజా సినిమా 'ఎన్‌బీకే 111' (వర్కింగ్ టైటిల్). ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ముంబై నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాను వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. శుక్రవారం (జూన్ 19) కాజల్ అగర్వాల్ బర్త్ డే సందర్భంగా 'ఎన్‌బీకే 111' నుంచి ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'ప్రతి తుఫాను వెనుక ఓ కారణం ఉంటుంది' అంటూ కాజల్ పాత్ర స్వభావాన్ని ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌తో తెలియజేసే ప్రయత్నం చేసింది యూనిట్. ఈ చిత్రానికి సంగీతం: తమన్.



## ఫలించిన రుక్మిణి వసంత్ పోరాటం

**కృత్రిమ మేధ సాంకేతికత దుర్వినియోగం మరోసారి సినీ పరిశ్రమను కుదిపేసింది. ప్రముఖ నటి రుక్మిణి వసంత్‌కు సంబంధించినట్లు ప్రచారం చేసిన అసభ్యకర ఫొటోలు, వీడియోలు పూర్తిగా నకిలీవని తేలడంతో ఆమె సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపట్టిన బెంగళూరు పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేయగా.. పలువురు నటి చూపించిన చొరవను అభినందిస్తున్నారు.**

'కాంతార' ఫేమ్ నటి రుక్మిణి వసంత్ పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అయిన బికినీ ఫొటోలు, వీడియోలు తీవ్ర వివాదానికి దారితీశాయి. స్విమ్మింగ్ పూల్ వద్ద బికినీలో ఫొటోషూట్ చేసినట్లు ప్రచారం కాగా.. ఆ వీడియోలు, ఫొటోలు పూర్తిగా ఏఐ సాయంతో సృష్టించినవేనని రుక్మిణి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, తన వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘిస్తూ అసత్య ప్రచారం చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు.

''నా పేరుతో వైరల్ అవుతున్న ఫొటోలు, వీడియోలు అన్నీ ఫేక్. వాటిని ఏఐ సాయంతో రూపొందించారు. ఈ వ్యవహారాన్ని నేను తీవ్రంగా పరిగణిస్తున్నాను. వాటిని సృష్టించిన వారిపైనా, ప్రచారం చేస్తున్న వారిపైనా చట్టపరమైన చర్యలు ప్రారంభించాం'' అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఈ ఘటనపై రుక్మిణి వసంత్ బెంగళూరు నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో ఏఐ సాంకేతికతను ఉపయోగించి అభ్యంతరకర చిత్రాలు, వీడియోలు తయారుచేసి సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. దీనివల్ల తన గౌరవానికి భంగం కలగడమే కాకుండా మానసిక వేదనకు గురయ్యానని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఐటీ చట్టం, భారతీయ న్యాయ సంహిత (BNS)లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాల సాయంతో నిందితులను గుర్తించిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించినట్లు భావిస్తున్న మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

అరెస్ట్ అయిన వారిలో బాగలకోట జిల్లా చిలకముఖి గ్రామానికి చెందిన రవికుమార్ (24), ప్రస్తుతం బెంగళూరులోని కామాక్షిపాళ్యలో నివసిస్తున్న చంద్రకాంత్ (33), మహాలక్ష్మీనగర్‌కు చెందిన రంజిత్ (25) ఉన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా,



కేసుపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

ఇటీవలి కాలంలో ఏఐ సాయంతో రూపొందిస్తున్న డీప్‌ఫేక్‌లు, మార్ఫింగ్ చిత్రాలు సినీ తారలు, ప్రజా ప్రతినిధులు, సామాన్యులను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా నటీమణుల ఫొటోలను అభ్యంతరకరంగా మార్చి వైరల్ చేయడం ఆందోళన కలిగిస్తోంది. గతంలోనూ పబ్లిక్ ఈవెంట్లలో మహిళా నటీమణుల శరీర భాగాలను జూమ్ చేసి చిత్రీకరించడంపై రుక్మిణి వసంత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పుడు ఏఐ సాయంతో ఏకంగా నకిలీ ఫొటోషూట్‌లను సృష్టించడంపై పోరాటం మొదలుపెట్టి విజయవంతం అయ్యారు.

ఇటీవల పలువురు సినీ నటీమణులు, టెలివిజన్ యాంకర్లు కూడా తమ పేర్లతో ప్రచారం అవుతున్న ఏఐ ఫొటోలు, వీడియోలపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నటి, యాంకర్ అనసూయ కూడా ఈ అంశాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీప్‌ఫేక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం మరింత స్పష్టమవుతోంది.



## వీక్లీ పోల్‌లో బీటీఎస్ ప్రభంజనం..

**అంతర్జాతీయ పాప్ సంగీత ప్రపంచంలో కొరియన్ బ్యాండ్ 'బీటీఎస్' మరోసారి తన సత్తా చాటుకుంది. బిల్‌బోర్డ్ నిర్వహించిన అత్యంత ప్రజాదరణ పొందిన కొత్త సంగీతం పోల్‌లో బీటీఎస్ సరికొత్త డిజిటల్ సింగిల్ 'కమ్ ఓవర్' భారీ మెజారిటీతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది.**

జూన్ 12 న పారంభమైన ఈ పోలింగ్‌లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బీటీఎస్ అభిమానులు భారీగా ఓట్లు వేయడంతో, ఏకంగా 86 శాతానికి పైగా ఓట్లతో ఈ పాట క్లీన్ స్వీప్ చేసింది. ఈ రేసులో హాలీవుడ్ పాప్ స్టార్ ఒలివియా రోడ్రిగో, జాక్ వైట్, బెబె రెక్సా, కాట్సే వంటి దిగ్గజ కళాకారుల కొత్త ఆల్బమ్‌లు పోటీలో ఉన్నప్పటికీ, బీటీఎస్ క్రేజ్ ముందు అవేవీ నిలవలేకపోయాయి. ఫలితంగా 'కమ్ ఓవర్' ఒకేపక్షంగా ల్యాండ్‌స్లైడ్ విజయాన్ని నమోదు చేసింది. రెండవ స్థానంలో ప్రముఖ పాప్ సింగర్ ఒలివియా రోడ్రిగో విడుదల చేసిన 'యూ సీమ్ ప్రెట్టీ శాడ్ ఫర్ ఎ గర్ల్ సో ఇన్ లవ్' ఆల్బమ్ నిలిచింది. 'కమ్ ఓవర్' అనేది బీటీఎస్ గతంలో విడుదల చేసిన 'అరిరంగ్' ఆల్బమ్‌కు సంబంధించిన బోనస్ ట్రాక్. ఇప్పటివరకు కేవలం ఫిజికల్ డీలక్స్ వినైల్ ఎడిషన్ లో మాత్రమే అందుబాటులో ఉన్న ఈ సాంగ్‌ను, బీటీఎస్ వార్షిక వేడుక 'ఫెస్టా' సందర్భంగా అధికారికంగా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్‌లోకి విడుదల చేశారు. కొరియన్, ఇంగ్లీష్ భాషల కలయికతో సాగే ఈ సాంగ్.. దూరమైన ప్రాణస్నేహితుడిని లేదా ప్రియమైన వారిని తిరిగి కలుసుకోవాలనే ఆరాటాన్ని, పశ్చాత్తాపాన్ని ఎంతో భావోద్వేగంగా ఆవిష్కరిస్తుంది. బీటీఎస్ సభ్యులైన ఆర్‌ఎమ్, సుగా, జె-హోప్ స్వయంగా ఈ పాట నిర్మాణంలో భాగస్వాములయ్యారు. ప్రస్తుతం గ్లోబల్ మ్యూజిక్ ప్లాట్‌ఫామ్స్‌పై 'కమ్ ఓవర్' స్ట్రీమింగ్ రికార్డులను తిరగరాస్తోంది.

## లైవ్ ఆల్బమ్‌తో శ్రేయా ఘోషల్ రికార్డు..

*భారతీయ చలనచిత్ర సంగీత ప్రపంచంలో తన మధురమైన గొంతుతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్ సరికొత్త రికార్డుకు సిద్ధమయ్యారు. తన సుదీర్ఘ కెరీర్‌లో మొట్టమొదటిసారిగా ఒక 'లైవ్ కాన్సర్ట్ ఆల్బమ్'ను విడుదల చేయబోతున్నట్లు సోనీ మ్యూజిక్ ఇండియా అధికారికంగా ప్రకటించింది. ఇటీవలే ఆమె ప్రపంచవ్యాప్తంగా పూర్తి చేసిన 'ఆల్ హార్ట్స్ 'మ్యూజికల్ టూర్ విశేషాలతో ఈ ఆల్బమ్‌ను రూపొందించారు.*



ప్రపంచవ్యాప్తంగా 44 నగరాల్లో జరిగిన ఈ మ్యూజికల్ టూర్‌లో.. ముంబై, లండన్, న్యూయార్క్, ఆమ్‌స్టర్‌డామ్ వంటి ప్రముఖ నగరాల కాన్సర్ట్ స్టేజీలపై శ్రేయ లైవ్‌గా పాడిన ఐకానిక్ సాంగ్స్‌ను ఇందులో చేర్చారు. ఈ ఆల్బమ్‌లో శ్రేయా ఘోషల్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్స్‌గా నిలిచిన బాలీవుడ్ పాటలు ఉండబోతున్నాయి. ఈ మ్యూజికల్ టూర్‌లో భాగంగా లండన్ లోని ప్రఖ్యాత ఓవో ఎరీనా వెంబ్లీ, కాలిఫోర్నియాలోని ఓక్‌లాండ్ ఎరీనాల్లో శ్రేయ ప్రదర్శనలు ఇచ్చారు. ముఖ్యంగా డెట్రాయిట్‌లోని 'ఫాక్స్ థియేటర్'లో గానకోకిల లతా మంగేష్కర్ తర్వాత ప్రదర్శన ఇచ్చిన రెండో భారతీయ కళాకారిణిగా శ్రేయా ఘోషల్ చరిత్ర సృష్టించారు. అలాగే లాస్ ఏంజిల్స్‌లోని ప్రసిద్ధ డాల్బీ థియేటర్ స్టేజ్‌పై పెర్ఫామ్ చేసిన ఏకైక భారతీయ సింగర్‌గా ఆమె రికార్డు సాధించారు.



## తమిళంలో మరిన్ని చిత్రాల్లో నటించాల్సింది : సమంత

నటి సమంత. ఈ పేరే ఒక సంచలనం. కథానాయకిగా కోలీవుడ్లో ఎంట్రీ ఇచ్చినా, అగ్ర కథానాయికిగా రాణిస్తుంది మాత్రం టాలీవుడ్ లోనే. అక్కడ స్టార్ హీరోలందరితోనూ జత కట్టేశారనే చెప్పాలి. కాగా వెబ్ సిరీస్ ద్వారా ప్రపంచ ప్రేక్షకులకు పరిచయం అయిన సమంత ఇటీవల నిర్మాతగానూ అవతారమెత్తారు. తొలి ప్రయత్నంగా శుభం అనే చిత్రాన్ని నిర్మించారు. మలి ప్రయత్నంగా ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పతాకంపై తన భర్త రాజ్ నిడిమోరు తో కలిసి నిర్మించి, నాయకిగా నటించిన చిత్రం మా ఇంటి బంగారం. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రం తమిళంలోనూ ఎంగళ్ తంగం పేరుతో శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల సామ్ తన చిత్ర టీమ్ తో చెన్నైలో సందడి చేశారు. ఈ సందర్భంగా నటి సమంత మాట్లాడుతూ ''చెన్నై తనకు ఎప్పుడూ ప్రత్యేకమే. సత్యం థియేటర్, ఈ పక్కనే నేను చదివిన కళాశాల ఇవన్నీ మంచి మెమోరీస్. తమిళంలో మరిన్ని చిత్రాలు చేసి ఉండాల్సింది. అయినా ఇంకా చాలా కాలం ఉంది. తమిళంలో మంచి కథా చిత్రాల కోసం ఎదురు చూస్తున్నాను.

ఇక ఎంగళ్ తంగం చిత్రం విషయానికి వేస్తే చిత్రాన్ని నిర్మించడం, విడుదల చేయడంలో నిర్మాతల కష్టం తెలిసి వచ్చింది. అయినా మంచి చిత్రం చేశారనే సంతోషం కలిగింది. ఇది యాక్షన్ తో కూడిన అనుబంధాలు మేళవించిన కుటుంబ కథా చిత్రంగా ఉంటుంది. చిత్రంలో యాక్షన్ సన్నివేశాల్లో ప్రేక్షకులను అలరిస్తాయి. ఎలాంటి కథా చిత్రాల్లో నటించాలని కోరుకుంటున్నారని అడుగుతున్నారని, అయితే మంచి జనరంజకమైన కథా చిత్రాల్లో నటించాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. తనకు పాటలు సన్నివేశాల్లో నటించడం కంటే యాక్షన్ సన్నివేశాల్లో నటించడమే ఈజీగా ఉందని అన్నారు. ఎంగళ్ తంగం చిత్రం బాగా వచ్చిందని సమంత చెప్పారు. కాగా ఈమె పనిలో పనిగా ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో దిగిన ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.




## 'జననాయగన్' కోసం ఢిల్లీకి సీఎం విజయ్.. రిలీజ్ డేట్ ఫిక్స్?

ప్రముఖ నటుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ఇంతకు ముందు కథానాయకుడిగా నటించిన కొన్ని చిత్రాలు విడుదల సమయంలో సమస్యలు ఎదుర్కొన్నాయి కానీ , జననాయగన్ చిత్రం అంత పెద్ద సమస్యలను ఎదుర్కొన లేదని చెప్పవచ్చు. చిత్రం ప్రారంభం నుంచి పూర్తి అయ్యే వరకు చాలా స్మూత్‌గా జరిగిపోయింది. ఎటు తిరిగీ సెన్సార్ విషయంలోనే పీట ముడిపడింది. నిజానికి హెచ్ వినోద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సెన్సార్ లో సమస్య ఎదురౌతుందని ఎవరు ఊహించలేదు. శాసనసభ ఎన్నికల సమయం కావడం, నటుడు విజయ్ పార్టీని ప్రారంభించి ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావడం వంటి విషయాలు తోడవడం, చిత్రంలో చర్చనీయాంశ సన్నివేశాలు చోటు చేసుకోవడంతో వంటి అంశాలు జననాయగన్ చిత్రానికి సెన్సార్ సమస్యలకు కారణం కావచ్చు. దీంతో గత జనవరి నెల నుంచి ఇప్పటి వరకు సుమారు 6 నెలలుగా ఈ చిత్రానికి సెన్సార్ సర్టిఫికెట్ రాలేదు. ఇలాంటి పరిస్థితుల్లో చిత్రం ఇంటర్నెట్లో అనధికారికంగా విడుదలై యూనిట్ సభ్యులకు పెద్ద షాక్ ఇచ్చింది. అయితే చిత్ర నిర్మాత వెంకట్ నారాయణన్ మాత్రం జననాయగన్ చిత్రాన్ని తెరపైకి తీసుకు రావడానికి శత విధాలా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు కూడా ఆయన చిత్ర విడుదల విషయమై ఢిల్లీకి చేరుకున్నారు.

అక్కడ సెన్సార్ బోర్డు ప్రధాన అధికారితో మాట్లాడనున్నట్లు సమాచారం. దీంతో జననాయగన్ చిత్రానికి ఈ నెల 19వ తేదీ (శుక్రవారం) లోపల సర్టిఫికెట్ వస్తుందనే నమ్మకంతో యూనిట్ సభ్యులు ఉన్నారు. ఇదే జరిగితే జననాయగన్ చిత్రం ఈ నెల 25వ తేదీన తెరపైకి వచ్చే అవకాశం ఉందనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. విజయ్ అభిమానులు జననాయగన్ చిత్ర విడుదల కోసం ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు.

## బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూసుకుపోతున్న వైష్ణవి చైతన్య



ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్స్ లో వైష్ణవి చైతన్య ఒకరు. ఆమె గురించిన ముఖ్యమైన వివరాలు ఇక్కడ ఉన్నాయి యూట్యూబ్‌లో షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్‌ల ద్వారా వైష్ణవి తన కెరీర్‌ను ప్రారంభించింది. ముఖ్యంగా షార్ట్ ఫిలిమ్స్ ద్వారా ఫ్యాన్స్ ను సొంతం చేసుకుంది. ఈ అమ్మడు హీరోయిన్ గా మారడానికి ముందు అల్లు అర్జున్ నటించిన 'అల వైకుంఠపురములో' సినిమాలో హీరో చెల్లెలిగా నటించింది. అలాగే నితిన్ హీరోగా నటించిన 'రంగ్ దే' సినిమాలో చిన్న పాత్రలలో కనిపించింది.. అలాగే మరికొన్ని సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. వైష్ణవి కెరీర్‌ను మలుపు తిప్పిన సినిమా 'బేబీ'. సాయి రాజేష్ దర్శకత్వంలో వచ్చిన ఈ ప్రేమకథా చిత్రంలో ఆసూపర్ హిట్ అయ్యింది. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, నటిగా వైష్ణవికి మంచి గుర్తింపు తెచ్చునది. ప్రస్తుతం ఎపిక్ అనే సినిమా చేస్తుంది. ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని సరసన ఓ ప్రాజెక్ట్‌లో అలాగే శర్వానంద్ వంటి యంగ్ హీరోల సినిమాల్లోనూ ఆమె హీరోయిన్ గా చేసే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com